నిరసనలు, నిలదీతలు...

వాడీవేడిగా సాగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ, కోడి వ్యర్థాల అక్రమ తరలింపు, టీడీఆర్‌ల జారీపై సుదీర్ఘ చర్చ

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం

- స్టీల్‌ప్లాంటుపై వైసీపీ నేతలది కపటప్రేమ అని కూటమి కార్పొరేటర్ల ఎదురుదాడి
- స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించే ప్రసక్తే లేదన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు
- ఫుడ్‌కోర్టుపై అధికారులను ప్రశ్నించిన కార్పొరేటర్లు
- పదిహేను రోజుల్లోగా తొలగింపునకు హామీ
- స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులను జీవీఎంసీ తక్షణం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్
- 148 అంశాలకు ఆమోదం



మేయర్ పీలా శ్రీనివాసరావును అడ్డుకునేందుకు యత్నిస్తున్న వైసీపీ కార్పొరేటర్లు. వారిని వారిస్తున్న టీడీపీ కార్పొరేటర్లు



అజెండా చదువుతున్న అధికారి వద్ద నుంచి పేపర్లు లాక్కుంటున్న వైసీపీ కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ, కోడి వ్యర్థాల అక్రమ తరలింపు/సేకరణ సహా పలు అంశాలపై శుక్రవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో వాడీవేడి చర్చ జరిగింది. ఈ క్రమంలో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కౌన్సిల్ తీర్మానం చేసింది. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం రాత్రి తొమ్మిది గంటల వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రధాన అజెండాలో 84 అంశాలు, టేబుల్ అజెండాలో 67 అంశాలను పొందుపరచగా, మూడు మినహా మిగిలిన 148 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది.

వైసీపీ కార్పొరేటర్లు నలుపు రంగు షర్టులు, కండువాలు ధరించి కౌన్సిల్ హాల్‌లోకి ప్రవేశించారు. సమావేశం ప్రారంభానికి ముందే మేయర్ పోడియం వద్ద కూర్చొని స్టీల్‌ప్లాంటులోని 32 విభాగాలను ప్రైవేటీకరించేందుకు పిలిచిన ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను రద్దు చేయాలని, ప్లాంటును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని కోరుతూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. వారికి సీపీఎం కార్పొరేటర్ గంగారావు జత కలిశారు. ఆ సమయంలో మేయర్ పీలా శ్రీనివాసరావు...అజెండాపై చర్చ జరిగిన తర్వాత స్టీల్‌ప్లాంటు అంశంపై మాట్లాడదామని ప్రతిపాదించారు. అయినా వైసీపీ సభ్యులు వినకపోవడంతో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఈ క్రమంలో అజెండాలోని అంశాలను చదివి సభ్యులకు వినిపించేందుకు యత్నిస్తున్న కార్యదర్శి సహాయకుడి మైక్‌ను వైసీపీ సభ్యులు లాగేయడంతో అది విరిగిపోయింది. దీంతో మేయర్ కలుగజేసుకుని వైసీపీ, సీపీఎం సభ్యులు స్టీల్‌ప్లాంటు అంశంపై ఏం డిమాండ్ చేయాలనుకుంటున్నారో తనకు రాతపూర్వకంగా ఇస్తే, తీర్మానం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిద్దామని చెప్పి సభను ఐదు నిమిషాలు వాయిదావేశారు. అనంతరం వైసీపీ, సీపీఎం సభ్యులు ... మిగతా 6వ పేజీలో

15 రోజుల్లోగా ఫుడ్ కోర్టు తొలగింపు

పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్టును తొలగించాలని 2023 జూలైలో కౌన్సిల్ తీర్మానం చేస్తే ఇంతవరకూ తొలగించకపోవడంలో ఆంతర్యమేమిటని కార్పొరేటర్లు పీతల మూర్తియాదవ్, గంధం శ్రీనివాసరావు, బిపిన్‌కుమార్‌జైన్‌లు అధికారులను నిలదీశారు. ఫుడ్‌కోర్టు వల్ల జీవీఎంసీకి పైసా ఆదాయం రావడం లేదని, దళారులు మాత్రం నెలకు రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారని, తక్షణం ఫుడ్‌కోర్టును తొలగించాలని డిమాండ్ చేశారు. పదిహేను రోజుల్లో ఫుడ్‌కోర్టు తొలగింపు పూర్తిచేస్తామని చీఫ్ సిటీప్లానర్ ప్రభాకరరావు వివరణ ఇచ్చారు.

నష్టాల్లోకి ఉక్కు

ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే లాభాలు

జూన్‌లో రూ.121 కోట్ల నష్టం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

- జూలైలో మరో రూ.182 కోట్లు...
- ఆగస్టు నెలలోనూ అదే పరిస్థితి?
- గాడిన పెట్టడంలో యాజమాన్యం వైఫల్యం
- ముడి పదార్థాలు సక్రమంగా అందకపోవడంతో తగ్గిన ఉత్పత్తి
- అదే సమయంలో పెరిగిన ఉత్పత్తి వ్యయం

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు మళ్లీ నష్టాలు మొదలయ్యాయి. ఆర్థిక సాయం అందిస్తే పూర్తిసామర్థ్యంతో ప్లాంటును నడిపించి, లాభాల్లోకి తెస్తామని చెప్పిన యాజమాన్యం ఆ మేరకు ఫలితాలు సాధించలేకపోతోంది. అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటూ ఉత్పత్తి వ్యయం పెంచేస్తోంది. లక్ష్య సాధన కోసం అధికారులను, కార్మికులను ప్రోత్సహించి, ఉత్సాహపరచాల్సిన యాజమాన్యం అందుకు విరుద్ధంగా పనిచేస్తోంది. ఉద్యోగులపై పనిభారం పెంచేసింది. వారి జీతభత్యాల్లో ప్రతి నెలా కోత పెడుతోంది. ఉద్యోగులు భయంతో పనిచేసే పరిస్థితి తీసుకువచ్చింది. ఈ అరాచకాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెదవి విప్పకపోవడమే విచిత్రం. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే... కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయం ప్రకారం 'స్టీల్' అనేది వ్యూహాత్మక రంగం కాదు. అందుకే విశాఖ ఉక్కును విక్రయించాలని 2021లో నిర్ణయం తీసుకుంది. అప్పటికి విశాఖ ఉక్కు రూ.వేయి కోట్ల లాభంలో ఉంది. నష్టాల కారణంగా దీనిని ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించారనేది తప్పుడు ప్రచారం.

గత ఆర్థిక సంవత్సరం అంటే 2024-25లో స్టీల్ ప్లాంటు రూ.3,444 కోట్ల నష్టాలను ప్రకటించింది. సెప్టెంబరులో ఇన్‌చార్జి సీఎండీగా సక్సేనా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి సంస్కరణల పేరుతో ఇష్టారాజ్యంగా నడిపిస్తున్నారు. అయినా నష్టాలు కొనసాగాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి నెల ఏప్రిల్‌లో రూ.74 కోట్ల లాభం వచ్చింది. మే నెలలో రూ.52 కోట్ల లాభం వచ్చింది. జూన్‌లో రూ.121 కోట్ల నష్టం వచ్చింది. జూలైలో మరో రూ.182 కోట్ల నష్టం వచ్చింది. ఆగస్టు నెలలో ఉత్పత్తి తగ్గిపోయింది. దాంతో ఈ నెల కూడా నష్టాలే వస్తాయంటున్నారు.

ఉత్పత్తిని చూసుకుంటే ఆర్థిక ఇబ్బందుల వల్ల చాలాకాలం రెండు బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్)లనే నడిపారు. ఏప్రిల్ నెలలో 4.2 లక్షల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేశారు. మే నెలలో కూడా అదే ఉత్పత్తి వచ్చింది. జూన్‌లో 4.21 లక్షల టన్నులు తీసుకువచ్చారు. జూన్ చివరి వారంలో మూడో బ్లాస్ట్‌ఫర్నేస్‌ను ... మిగతా 6వ పేజీలో

మారని హోటల్స్ తీరు!

ఎంవీపీ కాలనీలోని 'ఆహా ఏమి రుచులు' రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

- మూడు రోజులకుపైగా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు గుర్తింపు
- ఫ్రిజ్‌లో 85 కిలోల పదార్థాలు నిల్వ
- బూజుపట్టిన స్థితిలో గ్రేవీలు



ఎంవీపీలోని హోటల్‌లో నిల్వ ఆహార పదార్థాలు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని అనేక హోటళ్లలో నిల్వ ఆహార పదార్థాల విక్రయం యథేచ్ఛగా సాగుతోంది. ఈ నెల తొలివారంలో ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో పలు హోటళ్లలో రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహార పదార్థాలను గుర్తించారు. తీరు మార్చుకోవాలంటూ హెచ్చరికలు జారీ చేయడంతోపాటు కేసులు నమోదుచేశారు. అయినప్పటికీ కొన్ని హోటళ్ల తీరులో ఏమాత్రం మార్పు రాలేదు.

తాజాగా శుక్రవారం ఆహార భద్రత, ప్రమాణాల శాఖకు చెందిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జీవీ అప్పారావు ఎంవీపీ కాలనీలోని మిసెస్ ఆహా ఏమి రుచులు రెస్టారెంట్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్రిజ్‌లో 85 కిలోల నిల్వ ఆహార పదార్థాలను ఆయన గుర్తించారు. వీటిలో చికెన్ బిర్యానీ, ఫ్రై, చికెన్ లాలీపప్, న్యూడిల్స్ ఫ్రైడ్ రైస్, ఉడక బెట్టిన గుడ్లు, అపోలో ఫిష్, వెజ్ మంచూరియా, చికెన్ మంచూరియా ఉన్నాయి. ఇందులో కొన్ని ఆహార పదార్థాలు దుర్వాసన వస్తున్నాయి. వాటినే వినియోగదారులకు వేడి చేసి వడ్డిస్తున్నారు. అలాగే, అత్యంత దారుణమైన స్థితిలో ... మిగతా 6వ పేజీలో

బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా నాగేంద్ర

- కార్యదర్శిగా సురేంద్రమోహన్
- ఉపాధ్యక్షునిగా ఆడారి ఆనందకుమార్



నాగేంద్ర



ఆడారి ఆనంద్‌కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గాన్ని పార్టీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ శుక్రవారం ప్రకటించారు. అందులో విశాఖపట్నం వారికి అధిక ప్రాధాన్యం లభించింది. గత కమిటీకి దగ్గుబాటి పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు కోశాధికారిగా పనిచేసిన మొగళ్ల నాగేంద్రను ఇప్పుడు అదే పదవిలో మాధవ్ కొనసాగించారు. నాగేంద్ర విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులుగా ఏడేళ్ల బాధ్యతలు నిర్వహించారు. అలాగే విశాఖకు చెందిన యువ నాయకుడు సురేంద్ర మోహన్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. విశాఖ నుంచే సుజాతకు మహిళా కోటాలో కార్యదర్శి పదవి ఇచ్చారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎ.కేశవ్‌కాంత్‌ని నియమించారు. ఇక అనకాపల్లి జిల్లా నుంచి ఆడారి ఆనంద్‌కుమార్‌కు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అవకాశం ఇచ్చారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల



ఎస్జీటీలో 92.9 మార్కులతో మొదటి ర్యాంకు సాధించిన గనివాడ సుజాత

- 92.58 మార్కులతో ద్వితీయ స్థానంలో తాటికొండ ధనలక్ష్మి
- ఈ కేటగిరీలో 14,595 మందితో మెరిట్ జాబితా

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను శుక్రవారం రాత్రి విడుదల చేశారు. సెకండరీగ్రేడ్ టీచర్ల నియామకాల కోసం నిర్వహించిన రాత పరీక్షకు హాజరైన 14,595 మందికి వచ్చిన మార్కుల ప్రాతిపదికన మెరిట్ జాబితా విడుదల చేశారు. మొదటి నాలుగు స్థానాలు మహిళా అభ్యర్థులే కైవసం చేసుకున్నారు.

జిల్లాలో అత్యధికంగా 92.9 మార్కులతో గనివాడ సుజాత మొదటి ర్యాంకు సాధించారు. తాటికొండ ధనలక్ష్మి 92.58 మార్కులతో ద్వితీయ స్థానం, కొల్లి శారద 92.02 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. జాబితాలో 14,595వ ర్యాంకు సాధించిన వ్యక్తికి 14.22 మార్కులు వచ్చాయి. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులు ఉండగా అందులో సెకండరీ గ్రేడు టీచర్ (ఎస్టీటీ) పోస్టులు 574 (ఏజెన్సీతో కలిపి) ఉన్నాయి. మిగిలిన 565 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు.

స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో ఫిజికల్ సైన్స్ పరీక్ష రాసిన 1,360 మందికి వచ్చిన మార్కులతో విడుదల చేసిన జాబితాలో ఎన్.శ్రీనివాస్ 82.87 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. వెలగా ఎర్రాపాత్రుడు 81.78 మార్కులతో ద్వితీయ స్థానం, గండేపల్లి హరికృష్ణ 80.66 మార్కులతో తృతీయ స్థానం సంపాదించారు. గణితం సబ్జెక్టులో సుంకరం విజయ్ 94.67 మార్కులతో ప్రథమ స్థానం, కూనబిల్లి పద్మ 88.06 మార్కులతో ద్వితీయ, సరిపల్లి శ్రీనివాస్ 84.11 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. బయాలజీలో బోకం అనిత 89.71 మార్కులతో ప్రథమ, రెడ్డి మంగవిజయ 88.14 మార్కులతో ద్వితీయ స్థానం, సీహెచ్‌డీజీ బ్రహ్మచారి 84.27 మార్కులతో తృతీయ, తెలుగులో పంపోతు నాగేశ్వరరావు 85.4 మార్కులతో ప్రథమ, గురుగుబిల్లి ... మిగతా 6వ పేజీలో

రామవరంలో చెరువు కబ్జా

- ఎకరాకు మించి ఆక్రమణ
- చోద్యంచూస్తున్న రెవెన్యూ శాఖ



రామవరంలో కబ్జాకు గురైన చెరువు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం రామవరం గ్రామంలో గల చెరువును కొందరు కబ్జా చేశారు. ప్రస్తుతానికి ఒక ఎకరా వరకూ చదును చేసి మొక్కలు నాటారు. దశల వారీగా చెరువు మొత్తం ఆక్రమించుకునేందుకు స్కెచ్ వేసుకున్నారు. గ్రామ పరిధిలోని సర్వే నంబరు 86లో 4.14 ఎకరాల్లో చెరువు ఉంది. ఇది పూర్తిగా ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. చాలాకాలం నుంచి చెరువు కింద ఆయకట్టు భూముల్లో పంటలకు బదులుగా తోటలు వేశారు. వర్షాకాలంలో చెరువులో చేరిన నీటిని తోటల పెంపకానికి వినియోగిస్తున్నారు. అయితే చెరువుకు ఆనుకుని ప్రభుత్వ భూమిలో కొంతభాగం శ్మశానం కోసం కేటాయించారు. శ్మశానం కోసం బోరు తవ్వించారు. ఈ క్రమంలో చెరువు గర్భంలో గల మెరక ప్రాంతంపై కబ్జాదారులు కన్నేశారు. వర్షాకాలం ప్రారంభంలోనే ఎకరా మేర స్థలాన్ని చదునుచేసి మొక్కలు నాటారు. ప్రభుత్వానికి చెందిన చెరువులో కొంత భాగాన్ని చదునుచేసి మొక్కలు నాటినా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదు.

స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చేశాయ్

- జిల్లాలో 5.24 లక్షల బియ్యం కార్డులు
- ఇప్పటివరకూ 5.17 లక్షల స్మార్ట్ కార్డులు రాక
- 25 నుంచి సచివాలయాల ద్వారా పంపిణీ



జిల్లాకు చేరిన స్మార్ట్ రైస్ కార్డులు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏటీఎం కార్డు సైజులో రూపొందించిన స్మార్ట్ రైస్ కార్డులను ఈనెల 25వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. కార్డుదారులు సచివాలయానికి వెళ్లి వీటిని తీసుకోవలసి ఉంటుంది. అయితే దీనికి సంబంధించి విధివిధానాలు శనివారం జిల్లా పౌర సరఫరాల శాఖకు వచ్చే అవకాశం ఉంది.

జిల్లాలో 642 రేషన్ డిపోల పరిధిలో 5.24 లక్షల బియ్యం కార్డులు ఉండగా, ఇప్పటివరకూ 5.17 లక్షల స్మార్ట్ కార్డులు నగర పరిధిలో మూడు సర్కిళ్లు, నాలుగు మండలాల పౌర సరఫరాల కార్యాలయాలకు చేరాయి. ఈ స్మార్ట్ కార్డుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిహ్నాలు, నంబరు, కుటుంబ పెద్ద పేరు (ఇంటి యజమాని భార్య), వయస్సు, పుట్టిన తేదీ, కుటుంబంలో సభ్యుల వివరాలు, రేషన్ డిపో ఐడీ నంబరు, చిరునామా ముద్రించారు. ప్రతి కార్డును క్యూఆర్ కార్డుతో స్కాన్ చేసే సదుపాయం ఉంటుంది. ఇప్పటికే కార్డులు ఉన్నవారితోపాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు కూడా ఈ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తారు. జిల్లాలో ఇప్పటివరకూ 5,310 మంది కొత్త కార్డుకు దరఖాస్తు చేస్తే వారిలో 3,456 మంది వివరాలు పరిశీలించి ఆమోదించారు. వారికి కొత్తగా స్మార్ట్ కార్డులు అందజేయనున్నారు. ఇంకా కార్డులో అడ్రస్ మార్పునకు 1,679 మంది, ఇతర వివరాల మార్పునకు 1,050 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్డులో తప్పొప్పుల సవరణకు 1,010 మంది, కొత్తగా కుటుంబ సభ్యుల వివరాలు చేర్చడానికి 32,378 మంది, తొలగింపుల కోసం 2,131 మంది, కార్డుల విభజనకు 4,401 మంది, సరండర్‌కు 22 మంది దరఖాస్తు చేశారు. అన్ని కేటగిరీలు కలిపి 47,981 దరఖాస్తులు రాగా ఇంతవరకూ 35,492 దరఖాస్తులు పరిశీలించి ఆమోదించారు. వారందరికీ స్మార్ట్ కార్డులు పంపిణీచేస్తారు.

చిప్పాడలో పీ 4 పరిచయ కార్యక్రమం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో శుక్రవారం పీ4 పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ సంగీత్ మాథూర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈకార్యక్రమంలో దాతలు పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలని కోరారు. 2047 నాటికి రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దివీస్ కంపెనీ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ సంస్థ తరఫున ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, బంగారు కుటుంబాలను కూడా దత్తత తీసుకుని ఆదర్శంగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి. రామారావు, ఎంపీడీఓ నగేశ్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీదేవి, ఎంఈఓ శివరాణి, రాజకీయ నాయకులు అప్పారావు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ప్రముఖ టీవీ యాంకర్, సినీ నటి అనసూయ, రంజీ మాజీ క్రికెటర్ వై. జ్ఞానేశ్వర్, ఏసీఎల్ కామెంటేటర్ రాకేశ్ శుక్రవారం దర్శించుకున్నారు. వారికి దేవాలయ అధికారులు ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న వారి గోత్రనామాలతో అర్చకులు పూజలు చేయగా గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలను, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఐదో వార్డులోని సమస్యలపై వినతి

కొమ్మాది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్టాండింగ్ కమిటీ మెంబర్, వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిశారు. మారికవలస జాతీయ రహదారి నుంచి ఐటీ సెజ్‌కు వెళ్లే రోడ్డులో లైట్లు లేకపోవడంతో రాత్రివేళ మందుబాబులు, గంజాయి తాగేవారు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. తక్షణమే అక్కడ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొండవాలు ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. బోరవానిపాలెంలో సీసీ రోడ్లు, సాయిరాంకాలనీ, సర్వే నంబర్ 27 కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, మెట్ల మార్గాలు, పార్కులు, శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని విన్నవించారు.

'ఎమ్మెల్యే రవికుమార్‌పై ఆరోపణలు సరికాదు'



విలేకరులతో మాట్లాడుతున్న కళింగ సామాజికవర్గం నాయకులు

కొమ్మాది/మధురవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై చేస్తున్న అసత్య ప్రచారాలను వైసీపీ నాయకులు వెంటనే ఆపాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు మామిడి దుర్గారావు, పొన్నాడ రమణారావు అన్నారు. శుక్రవారం వారు కొమ్మాదిలో కళింగ సామాజికవర్గం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆ జిల్లా వైసీపీ నాయకులు రవికుమార్ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ఆమదాలవలసలోని ఒక మహిళా ప్రిన్సిపాల్‌ను పావుగా వాడుకుని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

బోటు షికార్ పునరుద్ధరణ

సాగర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ, ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్న బోటు షికార్‌ను శుక్రవారం నుంచి పునరుద్ధరించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో ఈనెల 14వ తేదీ నుంచి సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బోటుషికార్‌ను నిలిపివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అలల తాకిడి తగ్గడంతో బోటు షికార్‌ను పునరుద్ధరించారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

... 5వ పేజీ తరువాయి

చిరంజీవి 82.77 మార్కులతో ద్వితీయ, ఓమ్మి గంగునాయుడు 82.06 మార్కులతో తృతీయ, హిందీలో కురచా జ్యోత్స్న 86.05 మార్కులతో ప్రథమ, రెడ్డి మహాలక్ష్మి 85.05 మార్కులతో ద్వితీయ, మండపాలి ఝాన్సీబాయి 83.07 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఇంగ్లీష్‌లో మరడాన శ్రావణి 86.13 మార్కులతో ప్రథమ, కేఎస్‌కేజే ప్రకాష్ 85.72 మార్కులతో ద్వితీయ, దాడి దివ్యపరిమిళ 83.9 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో గొర్లె శివరామకృష్ణ 83.5 మార్కులతో ప్రథమ, చిట్టిమూరి వరప్రసాద్ 80.5 మార్కులతో ద్వితీయ, ఎర్ని శివప్రసాద్ 79 మార్కులతో తృతీయ, సోషల్ స్టడీస్‌లో గెంజి రవి 87.28 మార్కులతో ప్రథమ, భవిరిశెట్టి రామకృష్ణ 86.18 మార్కులతో ద్వితీయ, కర్రిరాజు నాగేశ్వరరావు 85.99 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఎస్జీటీ ఉర్దూలో షేక్ వాసింఅక్రమ్ 68.33 మార్కులతో ప్రథమ, పీడీఎస్ జావేద్ బాషా 62.6 మార్కులతో ద్వితీయ, పాలగిరి సానా 53.3 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

జోన్-1 ప్రాతిపదికన పీజీటీ ఫలితాలు వెల్లడి...

మొదట పీజీటీ (పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్స్) రాత పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. జోన్-1 (ఉత్తరాంధ్ర జిల్లాలు) పరిధిలో పీజీటీకి సంబంధించి అన్ని సబ్జెక్టులకూ కలిపి 73 పోస్టులు ఉన్నాయి. పీజీటీ ఇంగ్లీష్ పరీక్ష 1,659 మంది రాయగా వచ్చిన మార్కుల వివరాలను మెరిట్ లిస్టులో పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో పిన్నింటి రవికుమార్ అనే అభ్యర్థి 79.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, మజ్జి భవానీ 79 మార్కులతో రెండో ర్యాంకు, మళ్ల శ్రీను 78.5 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. హిందీ పరీక్ష 726 మంది రాయగా లెంక చక్రపాణి 82.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, కురచా నారాయణమూర్తి 82.5 మార్కులతో రెండో ర్యాంకు, చింతాటి భారతి 82 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. తెలుగు పరీక్ష 2,102 మంది రాయగా పి.ధర్మారావు 85.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, తుమరాడ దుర్గాప్రసాద్ 84.5 మార్కులతో రెండో ర్యాంకు, సరిపల్లి నాగరాజు 83 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. బయాలజీ సైన్స్ 549 మంది రాయగా కాత్రేనుకోన సత్యపావని 77.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, కాలేరపు కిషోర్ 72.5 మార్కులతో ద్వితీయ స్థానం, అల్లెను సౌజన్య 72.5 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. సివిక్స్ (57 మంది)లో బోర్లేజు హరీష్ 76.5 మార్కులతో ప్రథమ స్థానం, బొమ్మిడి ఢిల్లేశు 69 మార్కులతో రెండో స్థానం, బూరి తవిటినాయుడు 66.5 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. కామర్స్‌లో 81.5 మార్కులతో మద్దాల అనిల్‌కుమార్ ప్రథమ స్థానం, 60.5 మార్కులతో దుద్ది సూర్యనారీయణ ద్వితీయ స్థానం, 59.5 మార్కులతో లింగాల మోహన్ తృతీయస్థానంలో నిలిచారు. గణితం (452 మంది)లో 78.5 మార్కులతో సుంకరాన విజయ, 73.5 మార్కులతో ఆరంగి ధనుంజయరావు, 72 మార్కులతో కొప్పల లక్ష్మణరావు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఫిజికల్ సైన్స్ (420 మంది)లో 74 మార్కులతో నక్కా హరిబాబు, 70 మార్కులతో వెలగల ఎర్రాపాత్రుడు, 68.5 మార్కులతో అల్లు అశోక్ కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సోషల్ స్టడీస్ (146 మంది)లో కురమాన నిరోషా 85 మార్కులతో ప్రథమ స్థానం, రౌతు పోలినాయుడు 77.5 మార్కులతో ద్వితీయ స్థానం, కిల్లంపల్లి శ్రీకాంత్ 75.5 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

సింహాద్రినాథుని సన్నిధిలో లక్ష కుంకుమార్చన

సింహాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సింహవల్లీ తాయార్ సన్నిధిలో శుక్రవారం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో ప్రభాతారాధనలు పూర్తి చేశారు. తరువాత సింహవల్లీ తాయార్, చతుర్భుజి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో పది మంది అర్చకులు కుంకుమార్చన జరిపారు.

క్రీడాభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే గంటా

కొమ్మాది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖను టెక్నాలజీతో పాటు క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన కొమ్మాది ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్స్‌లో అమరావతి చాంపియన్ షిప్ పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గచ్చిబౌలి మాదిరిగా విశాఖలో కూడా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్స్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొమ్మాదిలో స్పోర్ట్సు కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. దివ్యాంగుల క్రీడల కోసం దేశంలో రెండు స్టేడియంలు మంజూరు కాగా అందులో రాష్ట్రానికి ఒకటి కేటాయించారని చెప్పారు. కొమ్మాదిలో 22 ఎకరాల్లో రూ. 200 కోట్లతో దివ్యాంగుల స్టేడియం నిర్మించనున్నారని వెల్లడించారు. క్రీడా మైదానాల అభివృద్ధికి, క్రీడాకారులను ఆర్థికంగా ఆదుకోవడానికి సీఎస్ఆర్ నిధులు, దాతల సహాయాన్ని కోరాలని అధికారులకు సూచించారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో, పోటీ పరీక్షల్లో క్రీడాకారులకు మూడు శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని తెలిపారు. డీఎస్సీలో 427 పోస్టులు కేటాయించామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో క్రీడా రంగం పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. ప్రతి పాఠశాలకు క్రీడా మైదానం ఉండాలని మంత్రి లోకేశ్ నిబంధన పెట్టారని చెప్పారు. అనంతరం ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, ఎంవీ మాణిక్యాలరావు, ఎస్. జయరాం, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు పూజారి శైలజ, కనకదుర్గ, పుణ్యవతి, హరికమల్, కంచర్ల సూర్యనారాయణ, ప్రతాప్‌కుమార్, సాయి సంహిత, వి. దేవుళ్లను ఎమ్మెల్యే గంటా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ, జిల్లా క్రీడాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా, శాప్ చైర్మన్ రవినాయుడు

శరవేగంగా మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం

వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

కొమ్మాది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్ ప్లాన్ రహదారలను శరవేగంగా నిర్మించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆయన మధురవాడ ఫ్లైఓవర్ కింద నుంచి రేవళ్లపాలెం,బక్కన్నపాలెం వరకూ చేపడుతున్న మాస్టర్ ప్లాన్ రహదారి పనులను పరిశీలించారు. రోడ్డు ప్రారంభంలో ఉన్న వైసీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతు ఇంటి వద్ద రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులు ఎందుకు వేగవంతం కావడం లేదని అధికారులను అడిగారు. ఈనేపథ్యంలో కమిషనర్, మాజీ కార్పొరేటర్ హనుమంతుకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. టీడీఆర్ తీసుకున్న తర్వాత కూడా రోడ్డు నిర్మాణానికి ఎందుకు స్థలం ఇవ్వడం లేదని కమిషనర్ ఆయనపై అసహనం వ్యక్తం చేశారు.



స్థానికులతో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

ఆలయాల్లో శ్రావణ పూజలు

భీమునిపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో శాకంబరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు సత్యసాయి శంకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వాసవి అష్టకం, మణిదీప వర్ణన, లలితా సహస్రనామ పారాయణ చేపట్టారు. రాత్రి శ్రీహరి కుసుమాంబ కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్య వైశ్య మహిళామండలి సభ్యులు, పాల్గొన్నారు. అలాగే కృష్ణాకాలనీలో వెంకటగిరిపై ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారికి అర్చకుడు అప్పలాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు.అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు కలిగొట్ల శ్రీరామ్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో ఐశ్వర్య లక్ష్మికి పూజలు చేస్తున్న మహిళలు

అష్టలక్ష్మీ దేవాలయంలో....

కొమ్మాది : అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 108 పట్టుచీరలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం లక్ష్మీనారాయణులను వజ్రకవచధారణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి, ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

రుషికొండలో...

సాగర్‌నగర్ : రుషికొండ టీటీడీ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది మహిళలు పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజలు జరిగాయి. అనంతరం భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు పర్యవేక్షించారు.

సింహగిరిపై...

సింహాచలం : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన రాజగోపురం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ముందుగా ప్రకటించిన ప్రకారం తొలి స్లాట్ పూజ ఉదయం 7.40 గంటలకు ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో శ్రీకారం చుట్టారు. మూడు స్లాట్లలో మొత్తం మూడు వేల మంది మహిళలు పాల్గొన్నారు. ఆగమ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. శ్రీకాంతాచార్యులు, వేదపండితులు భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పించి వ్రతాల్లో పాల్గొన్న వారికి తోరగ్రంథి కట్టించారు. అనంతరం అమ్మవారికి షోడశోపచారాలు జరిపించారు. అష్టోత్తర శతనామావళితో కుంకుమార్చన చేశారు. ఈఓ వేంద్ర త్రినాథరావు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేశారు. వ్రతాల్లో పాల్గొన్న వారికి దేవస్థానం సిబ్బంది పూజా సామగ్రి అందజేశారు.



శాకంబరి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



అప్పన్న స్వామి సన్నిధిలో జరిగిన పూజలో మహిళలు



టీటీడీ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అన్నదానంలో అక్రమాలపై ప్రత్యేక విచారణ

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన ఆలయంలో అన్నదానం పథకం పక్కదోవ పట్టిందని "ఆంధ్రజ్యోతి" ప్రచురించిన కథనాలపై దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ స్పందించారు. ఇక్కడి ఈఓకు లేఖ రాసి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆలయంలో భక్తుల వివరాలు తీసుకోవడానికి ఇచ్చిన బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయడం లేదని, అందుకే మాన్యువల్‌గా భక్తుల సంఖ్యను రికార్డ్ చేస్తున్నామని ఈఓ సమాధానం పంపినట్టు తెలిసింది. ఈ యంత్రాలు జూన్ నెల నుంచే పనిచేయడం లేదు. అలాగే ఆలయ సిబ్బంది హాజరుకు ఉపయోగించే బయోమెట్రిక్ యంత్రాలు కూడా మొరాయిస్తుండడంతో మార్చాల్సి ఉంది. పత్రికల్లో కథనాలు రావడంతో వాటి స్థానంలో కొత్త యంత్రాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

ప్రతి నెలా సమీక్షిస్తున్నా.. అదే తీరు

ప్రధాన ఆలయాల్లో అన్నదానం పథకం అమలును ప్రతినెల కమిషనర్, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్షిస్తున్నారు. భక్తుల కోసం తయారు చేసే ప్రసాదాలు, అన్నదానం ఆహార పదార్థాల నాణ్యత పరీక్షలు చేయించి, నివేదికలు పంపాలని కోరుతున్నారు. అయితే విశాఖలో ఆహార పదార్థాలు, నేయి వంటివి తనిఖీ చేసి నివేదికలు ఇచ్చే లేబరేటరీలు లేవు. దాంతో విజయవాడ దుర్గాదేవి ఆలయం అధికారులు ఎక్కడ పరీక్షలు చేయిస్తున్నారో తెలుసుకొని అక్కడికి ఈ ఆలయం సరకులు పంపడానికి ఏర్పాట్లు చేశారు. ప్రతి నెలా సక్రమంగా జరగాల్సిన వాటిలోనూ జాప్యం జరుగుతోంది.

విచారణాధికారిగా భ్రమరాంబ?

నగరంలోని అన్నదానం నుంచి మామూళ్లు వసూలు చేస్తున్న ఆలయంపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని విజయవాడలో ఉన్నతాధికారి భ్రమరాంబను కమిషనర్ ఆదేశించినట్టు తెలిసింది. ఆలయాల్లో నిర్వహించే అన్నదాన పథకం ఫుడ్ కమిటీలో ఆమె సభ్యురాలు కావడంతో ఆమెకే ఆ బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. ఆమె ఏదో ఒక రోజు ఆకస్మికంగా వచ్చి తనిఖీలు చేపట్టే అవకాశం ఉంది.

అప్పన్నకు బంగారు నగ బహూకరణ

సింహాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సేవలకు వినియోగించాలని కోరుతూ శ్రీకాకుళం పట్టణానికి చెందిన వైశ్యరాజు రాజా రామ్ కిరణ్‌రాజ్ ఆరుపేటల గల 49 గ్రాముల బంగారు శంఖు, చక్ర, నామాలు కలిగిన చైనును బహూకరించారు.నగను దేవాలయ డిప్యూటీ ఈఓ సింగం రాధ, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులకు శుక్రవారం ఆయన అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయం దర్శనం కల్పించారు.



భక్తుడు సమర్పించిన నగ

లడ్డూ విక్రయాలు పునఃప్రారంభం

సాగర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ టీటీడీ ఆలయంలో శుక్రవారం నుంచి లడ్డూ విక్రయాలను పునఃప్రారంభించినట్టు ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల భారీ వర్షాలు కారణంగా తిరుపతి నుంచి లడ్డూ రవాణా నిలిచిపోయింది. దీంతో రుషికొండ ఆలయంలో విక్రయాలు నిలిపివేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించి రవాణా సౌకర్యం మెరుగుపడడంతో లడ్డూలు ఆలయానికి చేరడంతో అమ్మకాలను పునఃప్రారంభించారు.

చిప్పాడ హైస్కూల్‌ను సందర్శించిన ఆర్‌డీఓ

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్‌డీఓ సంగీత్ మాథూర్ శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం వంటకాలను రుచిచూసి, విద్యార్థుల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు.

జిమ్‌సర్‌లో పాలియేటివ్ కేర్ పై శిక్షణ

ఎండాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) లోని స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో విద్యార్థులకు పాలియేటివ్ కేర్ (ఉపశమన సంరక్షణ) పై రెండు రోజుల శిక్షణను శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ బి. గీతాంజలి మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానంలో పాలియేటివ్ కేర్ ప్రాధాన్యతను వివరించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పద్మనాభం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరిన వరి పొలాల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. శుక్రవారం వారు పద్మనాభం, కృష్ణాపురం, విలాస్ ఖాన్‌పాలెం, మద్ది, పొట్నూరు గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వరి పిలక దశలో ఉందని,నీరు తీసిన వెంటనే ఎకరాకి 20 కిలోల యూరియా, పొటాష్ వేయాలని చెప్పారు.

నిరసనలు, నిలదీతలు...

... 5వ పేజీ తరువాయి

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణకు వీలుగా పిలిచిన టెండర్లను రద్దు చేయాలని, సొంత గనులు కేటాయించాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ రాతపూర్వకంగా మేయర్‌కు వినతిపత్రం ఇవ్వగా, ఆ మేరకు తీర్మానం చేసినట్టు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుపై వైసీపీ నేతలది కపట ప్రేమ అని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కనీసం చర్యలు తీసుకోలేదని, బకాయిలను రాష్ట్రప్రభుత్వం తరఫున రద్దు చేయాలని కోరితే కుదరదన్నారని గుర్తుచేశారు. అలాంటిది కూటమి ప్రభుత్వం రూ.14 వేల కోట్లు ప్యాకేజీని స్టీల్‌ప్లాంటుకు ప్రకటించి కాపాడేందుకు కృషిచేస్తే, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ డ్రామాలు ఆడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని హామీ ఇచ్చారు. కేవలం సమర్థ ఉత్పత్తి లక్ష్యంగానే 'కాంప్రెహెన్సివ్ కాంట్రాక్ట్ సిస్టమ్'లో భాగంగానే చిన్న చిన్న కాంట్రాక్టర్లను తొలగించి ఒకే కాంట్రాక్టును పిలుస్తున్నారని వివరణ ఇచ్చారు. అనంతరం కోడి వ్యర్థాల తరలింపు అంశంపై చర్చ జరిగింది. జీవీఎంసీ పరిధిలో కోడి వ్యర్థాల సేకరణకు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లను ఎంపిక చేసినప్పటికీ, అనధికార వ్యక్తులు, రౌడీషీటర్లు కోడి వ్యర్థాలను సేకరించి చేపల చెరువులకు తరలించుకుపోతున్నారని జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రజారోగ్య విభాగం అధికారి కిషోర్ పాత్ర కీలకంగా ఉందని, ఆయన్ను ఐదేళ్లపాటు ఒకేచోట ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. అనధికారికంగా కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను స్వయంగా పట్టుకుని అప్పగించినా చర్యలు తీసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని గంధం శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఉదంతంలో లోతుగా విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్ కేతన్‌గార్గ్ వివరణ ఇస్తూ కోడి వ్యర్థాల తరలింపులో అవకతవకలు జరుగుతున్నమాట వాస్తవమేనని, దీనిని నియంత్రించేందుకు కొద్దిరోజులుగా సాంకేతిక పరిజ్ఞానం సాయం తీసుకుంటున్నామన్నారు. కోడి వ్యర్థాల నిర్వహణకు రెండ్రింగ్ యూనిట్‌ను నెలకొల్పేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు గడువు పూర్తయిపోయినాసరే జీవీఎంసీలో పలు పనులను వారికే ఎందుకు అప్పగిస్తున్నారని టీడీపీ, వైసీపీ, జనసేన సభ్యులు ప్రశ్నించారు. రూ.వేల కోట్ల విలువైన పనులు చేస్తున్న స్మార్ట్ సిటీని ఒక ప్రైవేటు ఉద్యోగి నడిపిస్తుండడం, జీవీఎంసీకి పర్యవేక్షణ అధికారం లేకపోవడం సరికాదని, తక్షణం ఆ ప్రాజెక్టులను జీవీఎంసీ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై తగు నివేదిక ఇవ్వాలని అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. నగరంలో రోడ్లను శుభ్రం చేసే వాహనాల నిర్వహణకు రూ.40 కోట్లతో టెండరు పిలిచే ప్రతిపాదనపై జనసేన, టీడీపీ, వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇంతవరకు ఏడాదికాలానికి టెండర్లు పిలిస్తే, ఇప్పుడు ఏకంగా రెండేళ్ల వ్యవధికి పిలవడం, బ్లాక్‌లిస్టులో ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు అనుకూలంగా నిబంధనలు మార్చడంపై సభ్యులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీనిపై స్పందించిన మేయర్ పీలా శ్రీనివాసరావు ఏడాదికాలానికి మాత్రమే టెండర్లు పిలిచేలా టెండరు నిబంధనలు మార్చాలని ఆదేశించారు. యూసీడీ విభాగం ఆధ్వర్యంలో నగరంలో వీధివిక్రయదారుల కమిటీని నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేశారని, జీవీఎంసీపైనా, అధికారులపైనా కోర్టులో కేసులు వేసిన వ్యక్తులకు కమిటీలో స్థానం ఏ ప్రాతిపదికన ఇచ్చారో చెప్పాలంటూ పీతల మూర్తియాదవ్ ప్రశ్నించారు. అలాగే స్మార్ట్ వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు స్థలాలు ఎంపిక చేయడంపై కూడా సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేయడంతో ఆ అంశాలను వాయిదా వేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. ఎంవీపీ, ఎంకే ప్రాజెక్టు, సిరిపురంలోని ఎంవీవీ పీక్ ప్రాజెక్టులకు దొడ్డిదారిన టీడీఆర్‌లు జారీచేసి జీవీఎంసీకి రూ.కోట్లలో నష్టం కలిగించారని, దీనివెనుక డీటీసీపీ ఆర్జే విద్యుల్లత పాత్ర ఉన్నందున ఆమెపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సీసీపీ ప్రభాకరరావు వివరణ ఇస్తూ టీడీఆర్‌ల జారీ ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతుందని, గత రెండు నెలల్లో కేవలం 35 టీడీఆర్‌లు మాత్రమే జారీచేశామన్నారు. సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు జారీచేసి తర్వాత అబియెన్స్‌లో పెట్టేశారని, వారంతా నిరుపేదలు కాబట్టి తక్షణం వాటిని అబియెన్స్ నుంచి తొలగించి వారికి న్యాయం చేయాలని 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం కోరారు. కొత్తగా ఏర్పాటుచేయనున్న జోనల్ వ్యవస్థలో వార్డుల కేటాయింపు గందరగోళంగా ఉన్నందున పునఃపరిశీలించాలని 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, 69వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నీటి సరఫరా విభాగంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు రూ.వెయ్యి చొప్పున వేతనం పెంచేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మిగిలిన కార్మికులకు కూడా వేతనం పెంపుదలను వర్తింపజేయాలని రెండో వార్డుకార్పొరేటర్ గాడు చిన్నికుమారి డిమాండ్ చేశారు.

మారని హోటల్స్ తీరు!

... 5వ పేజీ తరువాయి

20 కిలోల గ్రేవీ (కూర పులుసు) ఉంది. గ్రేవీపై బూజు పట్టడంతోపాటు దుర్వాసన వెదజల్లుతున్నట్టు అధికారులు గుర్తించారు. వీటిపై రెస్టారెంట్ నిర్వాహకులను ప్రశ్నించగా రెండు రోజులు కిందటివిగా అంగీకరించారు.దీంతో కొన్ని నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలను విక్రయించినట్టు నిర్ధారించి కేసు నమోదుచేశారు.

తస్మాత్ జాగ్రత్త..

నగర పరిధిలోని అనేక హోటళ్లు, రెస్టారెంట్స్‌లో ఇదే పరిస్థితి ఉంటోందని అధికారులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నా నిర్వాహకుల్లో మార్పు రావడం లేదని చెబుతున్నారు. ఒకేసారి పెద్దమొత్తంలో వండడం, మిగిలిపోయిన వాటిని మరుసటిరోజు, ఆ మరుసటిరోజు...ఉంచి వేడి చేసి విక్రయించడం పరిపాటిగా మారిందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన ఆహార పదార్థాలను పారవేయడం వల్ల నష్టం వాటిల్లుతుందన్న ఉద్దేశంతో ఇలా చేస్తున్నారని అప్పారావు వెల్లడించారు. కొన్నిచోట్ల కిచెన్‌లో వాతావరణం చాలా అపరిశుభ్రంగా ఉంటున్నదని, అటువంటిచోట్ల వండిన ఆహార పదార్థాలు తినడం వల్ల అనారోగ్యం బారినపడే అవకాశం ఉందన్నారు. ఇకపోతే, కొన్ని హోటల్స్‌లో రుచికోసం, రంగుకోసం ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, రసాయనాలు వినియోగిస్తున్నారన్నారు.

నష్టాల్లోకి ఉక్కు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించడంతో జూలైలో ఉత్పత్తి పెరిగి 5.02 లక్షల టన్నులకు చేరింది. అమ్మకాల విషయానికి వస్తే ఏప్రిల్‌లో రూ.1,482 కోట్లు, మే నెలలో రూ.1,678 కోట్లు, జూన్‌లో రూ.1,636 కోట్లు, జూలైలో రూ.1,9798 కోట్లు విలువైన ఉత్పత్తులు విక్రయించారు.

జూలైలో వెళ్లిపోవాలని ముందుగానే బీఎఫ్-3 ప్రారంభం

స్టీల్‌ప్లాంటుకు ఇన్‌చార్జి సీఎండీగా ఉన్న సక్సేనా బ్లాస్టఫర్నేస్-3ను ప్రారంభించేసి జూలై నెలలో సొంత సంస్థకు వెళ్లిపోవాలని భావించారు. నవంబరులో ఆయన రిటైర్‌మెంట్ ఉందని సమాచారం. కాంట్రాక్టు వర్కర్లను వేల సంఖ్యలో తీసేసిన నేపథ్యంలో వర్షాకాలంలో బ్లాస్ట్ ఫర్నేస్-3ను ప్రారంభించడం సరైన నిర్ణయం కాదని ఉద్యోగ వర్గాలు ముందునుంచీ చెబుతున్నాయి. అయితే సీఎండీ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలనే హడావిడిలో దానిని ప్రారంభింపజేశారని, తగినన్ని ముడిపదార్థాలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పుడు పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నారని అంటున్నారు. ఇదిలావుండగా ఒకేసారి 40 విభాగాలను ప్రైవేటుకు ఇవ్వడానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటనలు ఇవ్వడంతో విమర్శలు చెలరేగుతున్నాయి. ఉద్యోగులలో అశాంతిని నెలకొల్పి వెళ్లిపోతానంటే కుదరదని, రిటైర్‌మెంట్ వరకూ ఇక్కడే ఉండాలని ఇన్‌చార్జి సీఎండీని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశించిందని తెలిసింది. ఇప్పుడు ముడి పదార్థాలు అందుబాటులో లేక ఉత్పత్తి తగ్గిపోయింది. మరోవైపు స్టీల్ తయారీకి పెల్లెట్లను, కోక్‌ను బయట కొనడం వల్ల ఉత్పత్తి వ్యయం పది శాతం పెరిగిందనే వాదన గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే వేలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించారని, దానికి తగ్గట్టు వ్యయం ఎందుకు తగ్గలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

కొనసాగుతున్న రైతుల 'వంటావార్పు'

పద్మనాభం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాపురంలో ఎంఎస్ఎంఈ పార్కు వద్ద రైతులు నిరసనలో భాగంగా వంటావార్పు కార్యక్రమాన్ని కొన సాగిస్తున్నారు. శుక్రవారం కూడా అక్కడే వంట చేసి, భోజనాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఇప్పటివరకు రైతులు సాగు చేసి పెంచిన చెట్లకు పరిహారం ఇవ్వడంతో పాటు ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించాలని, పార్కులో స్థాపించే కంపెనీల్లో రైతుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు.

ఏయూలో దివ్యాంగ ఉద్యోగులకు
అధికారి వేధింపులు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని రికార్డు సెక్షన్‌లో పనిచేసే అధికారిణి తన అజమాయిషీలో పనిచేసే పలువురు దివ్యాంగ ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తున్నారు. అధిక మొత్తంలో వడ్డీలకు అప్పు ఇస్తూ మరి కొందరిని కోర్టుల చుట్టూ తిప్పుతున్నట్టు బాధిత ఉద్యోగులు చెబుతున్నారు. ఏయూలోని రికార్డు, టెలీ ఎక్స్ఛేంజ్ విభాగంలో కొందరు దివ్యాంగులు పని చేస్తున్నారు. ఇదే సెక్షన్‌కు చెందిన ఒక అధికారిణి ఉద్యోగుల వైకల్యాన్ని వెక్కిరించేలా మాట్లాడడం, పనులు చేయలేని వారికి ఉద్యోగాలు ఎందుకంటూ అవమానించడం వంటి చేష్టలతో ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆమెకు ఉన్నతాధికారి అండగా ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కంటి చూపులేని ఉద్యోగులు ఖాళీ సమయంలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీసి మానసికంగా వేధిస్తున్నారని వాపోయారు. ఏ పని చేసినా లోపాలు వెతుకుతూ ఆవేదనకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

వర్సిటీలో వడ్డీ వ్యాపారం..

వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా సదరు అధికారిణి యథేచ్ఛగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్టు తెలిసింది. పలువురు ఉద్యోగులకు లక్షలాది రూపాయలను భారీ వడ్డీలకు ఇస్తున్నారు. ఖాళీ ప్రామిసరీనోట్లపై సంతకాలు చేయించుకుని ఆమె డబ్బులు ఇస్తుంటారని చెబుతున్నారు. తిరిగి చెల్లించిన తరువాత కూడా డబ్బులు ఇవ్వలేదంటూ వేధిస్తున్నారని వాపోయారు. అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్న సదరు అధికారిణిని కట్టడి చేయాలని పలువురు ఉద్యోగులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

యాచకులకు ఆశ్రయం



యాచకులను రెడ్‌క్రాస్ సొసైటీలో త్రీటౌన్ పోలీసులు

మద్దిలపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మూడోపట్టణ పోలీసులు శుక్రవారం బెగ్గర్స్ ఫ్రీ విశాఖ సిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఐ పైడయ్య ఆధ్వర్యంలో అశీల్‌మెట్ట సంపత్ వినాయక ఆలయం వద్ద బిక్షం, డబ్బులు అడుక్కుంటున్న యాచకులను శుభ్రం చేసి పెదవాల్తేరులోని రెడ్ క్రాస్ సొసైటీలో చేర్పించారు.

ఈ సందర్భంగా సీఐ పైడయ్య మాట్లాడుతూ యాచకులు లేని నగరంగా విశాఖను తీర్చిదిద్దడానికి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యాచకులను గుర్తించి వారికి వసతి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24,టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 38, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 26, బీరకాయలు 44, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 30, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 74, బరబాటి 38, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 72, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	101
లైవ్ ధర	121
విత్ స్కిన్	212
స్కిన్‌లెస్	222

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వరలక్ష్మి వ్రతాలు ఆచరించిన మహిళలు



ఎంవీపీ కాలనీ : సత్యసాయి మందిర్ వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిరంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. భారీగా హాజరైన మహిళా భక్తులతో సమూహ ప్రార్థనలు నిర్వహించారు. వేదపఠనం, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బాలవికాస్ గురువుల సమక్షంలో వ్రతం నిర్వహించారు. భగవాన్ సత్యసాయిబాబా ప్రబోధించిన సమస్తలోకాః సుఖినోభవంతు సందేశాన్ని ప్రతిబింబిస్తూ ఈ వ్రతం చేశారు. మంగళ హారతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. విశాఖ సిటీ సత్యసాయిసేవా సమితి, మహిళా యువ విభాగం ప్రతినిధులు లావణ్య, సాయికుమార్ తదితరులు పర్యవేక్షించారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని 16వ వార్డు సంజయ్ గాంధీ కాలనీ కనకదుర్గా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక శ్రావణ లక్ష్మి పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో అభిషేకాన్ని జరిపి, అనంతరం పుష్పాలు, గాజులతో అలంకరించారు. మహిళలంతా తమ ఇంటిలో పూజలు నిర్వహించుకొని, ఆలయానికి వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన జరిపారు. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీరామానంద ఆశ్రమం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలోని వేంచేసి ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హెచ్‌బీ కాలనీలోని బహుముఖ గాయత్రి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని సాయంత్రం లలితా సహస్ర నామాలను మహిళలు పఠించారు. గాయత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మంత్రాలను జపించారు.



సంజయ్ గాంధీ కాలనీలో దుర్గాదేవికి పూజలు

బీచ్ రోడ్డులో కూలిన రిటైనింగ్ వాల్

- తీరం కోతకు గురవడంతో తలెత్తిన సమస్య



బీచ్ రోడ్డులో రిటైనింగ్ వాల్ కూలిన దృశ్యం

బీచ్ రోడ్డు, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్ రోడ్డులో తీరం వెంబడి దాదాపు అర కిలో మీటర్ మేర కోతకు గురి కావడంతో రిటైనింగ్ వాల్ కూలిపోయింది. గతంలో సబ్‌మెరైన్ పార్కు హోటల్ వద్ద ఇదే పరిస్థితి నెలకొనగా, కోత నివారణకు కొబ్బరి చెట్లు పాతి బరువైన పెద్ద రాళ్లను ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇక్కడ మళ్లీ తీరం కోతకు గురైంది. రిటైనింగ్ వాల్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. బీచ్‌రోడ్డు కొంత లోతట్టుగా ఉంటుంది. దీంతో ఆటుపోట్లు, తుపాన్ల సమయంలో అలలు తీరం వైపు బాగా ముందుకు వస్తాయి. గతంలో ఇక్కడ రక్షణ గోడ ఉండడంతో అలలు ఎంత వేగంగా వచ్చినా పెద్దగా సమస్య ఉండేది కాదు. క్రమంగా గోడ దెబ్బ తింటూ వచ్చింది. ఆ పరిస్థితిలో అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో గోడ పూర్తిగా పడిపోయింది. ఇక అప్పటి నుంచి తీరం కోతకు గురవుతూ వస్తోంది. తుపాన్ సమయంలో అలలు రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మురళి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులు పందిర్ల ఏర్పాటుకు కచ్చితంగా అనుమతి తీసుకోవాలని ఎంవీపీ కాలనీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మురళి స్పష్టం చేశారు. నిర్వాహకులు నిబంధనలను అనుసరించి మాత్రమే ఉత్సవాలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఇటీవల నిబంధనలను ప్రకటించారని, ఆ ప్రకారం తగిన అనుమతితో పందిర్లు వేసుకోవాలని సూచించారు. ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా అనుమతుల కోసం ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలను అమర్చాలని తెలిపారు. వీటిని పోలీసుల కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించాల్సి ఉంటుందన్నారు. రహదారుల్లో వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకూడదని, రహదారులను తవ్వకూడదన్నారు. అనుపు కార్యక్రమానికి కూడా కొన్ని మార్గదర్శకాలు ఉంటాయన్నారు. గణేష్‌ఉత్సవ్ డాట్ నెట్‌లో అన్ని వివరాలను నమోదు చేయాలని తెలిపారు. నిర్వాహకుల వివరాలు కూడా అందించాల్సి ఉంటుందని, అలాగే విద్యుత్తు సరఫరా అనుమతి కూడా ఉండాలని తెలిపారు. డీజేలు పెట్టి, శబ్ద కాలుష్యానికి అనుమతిలేదని స్పష్టం చేశారు. అనుమతుల్లేకుండా నిర్వహించే ఉత్సవ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం





సమతా కళాశాలలో మట్టి వినాయక ప్రతిమలను తయారుచేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగించవద్దని, మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దామని విద్యార్థినులు నినదించారు. ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులతో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుడికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గత కొన్నేళ్ల నుంచి డైమండ్ పార్కు సమీపంలోని రోడ్డుపై దిక్కుతోచని స్థితిలో ఉన్న సురేష్ (38) అనే నిరాశ్రయుడికి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. కాలికి తగిలిన గాయంతో గత కొన్నేళ్ల నుంచి రోడ్డుపైనే ఉంటున్న ఆయనను చూసిన ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్సై బీశెట్టి వెంకటేశ్వరరావు స్పందించి ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహం సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే స్పందించిన గృహం సిబ్బంది సకాలంలో వచ్చి ప్రథమ చికిత్స అందించి వసతిగృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు.

సమావేశాల్లో నిర్ణయాలపై తక్షణ చర్యలకు కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్షా మండలి, దిశా సమావేశాల్లో ప్రస్తావించిన అంశాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ హౌసింగ్, ఈపీడీసీఎల్, జీవీఎంసీ, మహిళా, శిశు సంక్షేమశాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలకు చెందిన అంశాలపై ప్రగతి నివేదికలు వెంటనే అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో కొందరు ప్రభుత్వ పాఠశాలల్లో చేరలేదంటూ గతంలో దిశ సమావేశంలో చర్చకు వచ్చిన విషయం గుర్తుచేస్తూ, దీనిపై నివేదిక ఇవ్వాలన్నారు.టిడ్కో ఇళ్లు పొందలేని వారికి వెంటనే వారి ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీశంకర్, సీపీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి,ఇతరఅధికారులు పాల్గొన్నారు.

భర్త హత్య కేసులో జీవిత ఖైదు

విజయనగరం క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో 2015లో నమోదైన హత్య కేసు నిందితురాలు విశాఖ జిల్లా భీమిలి మండలం నగరపాలెం గ్రామానికి చెందిన గారి వెంకట జ్యోతిర్మయికి జీవితఖైదు విధిస్తూ విజయనగరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి బి.అప్పలస్వామి తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. అదే మండలం కాపులదిబ్బవాని పాలెంకు చెందిన చొక్కా నరేష్, ఉప్పాడకు చెందిన పాడ రాజు అలియాస్ ముక్కు అనే ఇద్దరు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించినట్టు తెలిపారు. వెంకట జ్యోతిర్మయికి రమేష్ అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు ఆనందపురం మండలం బొడ్డుపాలెం గ్రామంలో నివాసం ఉండేవారు. భర్త గార రమేష్‌కు సీమేన్‌గా ఉద్యోగం రావడంతో శిక్షణ నిమిత్తం 2015లో చెన్నై వెళ్లిపోయారు. భార్య వెంకట జ్యోతిర్మయికి భీమిలి మండలం కాపుల దిబ్బవాని పాలెంనకు చెందిన రాగాతి రాము అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. భర్త రమేష్ శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన తరువాత వీరి విషయాన్ని గుర్తించి భార్యను ప్రశ్నించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదాలు జరిగేవి. దీంతో రమేష్‌ను అడ్డు తొలగించేందుకు నిందితులు ప్రణాళిక రూపొందించారు. 2015 జూలై 26న రమేష్ తన భార్య వెంకట జ్యోతిర్మయిని ఇదే విషయమై ప్రశ్నించగా, తన ప్రియుడు రాగాతి రాముకు ఫోన్ చేసి రప్పించింది. తలుపు చెక్కతో భర్త రమేష్ తలపై కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. దీన్ని జ్యోతిర్మయి రెండో కుమార్తె సౌమ్య చూసింది. చొక్కా నరేష్, రాజు అనే వ్యక్తుల సహకారంతో రాగాతి రాము, జ్యోతిర్మయి.. రమేష్ మృతదేహాన్ని అర్ధరాత్రి భీమిలి బీచ్‌కు తీసుకువెళ్లి పెట్రోలు పోసి కాల్చేశారు. అనంతరం రెండో కుమార్తె సౌమ్యను పూల్‌బాగ్ లోని ఓ బావిలో పడేసి చంపేశారు. ఈ విషయం టూటౌన్ పోలీసులకు తెలిసి కేసు నమోదు చేశారు. నిందితులు నలుగురిని అప్పటి టూటౌన్ సీఐ అంబేద్కర్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన సీఐలు దుర్గాప్రసాద్, విజయానంద్, రామారావు దర్యాప్తు చేపట్టి నిందితులపై అభియోగ పత్రాలు దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ టి.శ్రీనివాసరావు కేసును పర్యవేక్షిస్తూ న్యాయస్థానంలో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో నిందితులకు శిక్ష ఖరారు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. రాగాతి రాము అనే నిందితుడు కేసు విచారణలో ఉండగానే రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. దీంతో కోర్టు మిగతా ముగ్గురికి శిక్ష ఖరారు చేసింది.

ఎస్సీ యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ఎస్సీ యువతకు పీఎంజే పథకంలో భాగంగా హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ అందించనున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన 10 మంది పురుషులు, అయిదుగురు మహిళలకు ఈ అవకాశం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. నలభై రోజుల పాటు ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా నివాసులై, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు జతచేసి, దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. 20 ఏళ్ల వయసు పైబడి, కనీసం ఏడాది కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని, 40 ఏళ్ల దాటిన వారు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాలని తెలిపారు. హెచ్‌ఎంవీ ఎల్‌ఎల్‌ఆర్ పొందడానికి రూ.210లు, హెవీ వెహికల్ లైసెన్స్ పొందటానికి రూ. 1060లు అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన యువతీయువకులు ఎంవీపీ కాలనీలోని జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ, సంక్షేమ భవన్ కార్యాలయానికి ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని ఆమె తెలిపారు.

ఏయూలో విద్యార్థుల రక్తదానం



ఏయూ కెమిస్ట్రీ విభాగంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు, పాల్గొన్న ఆచార్యులు, ఈశ్వరీ విశ్వవిద్యాలయ ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ, కేజీహెచ్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా శుక్రవారం ఏయూ కెమిస్ట్రీ విభాగంలో స్వచ్ఛంధ రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏయూ ఆచార్యులు బీబీవీ శైలజ, డి.సంధ్యాదీపిక, బ్రహ్మకుమారీలు శివలీల, జ్యోత్స్న, కేజీహెచ్ వైద్య బృందం పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి



దాడికి పాల్పడిన ప్రసాద్

ఆరిలోవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :శ్రీకాంత్‌నగర్ లేఅవుట్ సమీపంలో ఉన్న జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం బొట్టా పృథ్వీరాజ్ (25)పై అదే ప్రాంతానికి చెందిన మేడ ప్రసాద్ (19) కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో పృథ్వీరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ వై.కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుడ్ని ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వివాహ సంబంధం నేపథ్యంలో ఈ దాడి జరిగినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల అర్హత పత్రాల పరిశీలన

విశాలాక్షినగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కైలాసగిరి ఏఆర్ రిజర్వు పోలీసు గ్రౌండ్‌లో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్. మోహన్‌రావు పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. 659 మంది అభ్యర్థులలో 627 మంది హాజరయ్యారు. 70 మంది మహిళా అభ్యర్థులలో ఒకరు హాజరుకాలేదు. మహిళా అభ్యర్థుల కోసం రెండు కౌంటర్లను అందుబాటులో ఉంచారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సైబర్ సెల్ సీఐ బి.వెంకట్రావు, ఆర్ఐలు మన్మథరావు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గణపతి మండపాల ఏర్పాటుకు
అనుమతుల ప్రక్రియ సులభతరం

- సింగిల్ విండో విధానం అమలు
- ప్రత్యేక వెబ్‌సైట్ : geneshutsav.net రూపకల్పన
- ఇంటి నుంచే అనుమతులు పొందే అవకాశం



మద్దిలపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి పండుగ అంటేనే కోలాహలం. వీధిల్లో ఒకటే సందడి.. ఇందుకోసం నగరంలోని వీధివీధిలో గణపతి మండపాలు వెలుస్తాయి. ఈ మండపాలు ఏర్పాటు చేయాలంటే జీవీఎంసీ, పోలీస్, ఫైర్.. ఇలా వివిధ శాఖల అనుమతులు పొందాల్సి వచ్చేది. చవితికి ఇంకా అయిదు రోజులే ఉంది. ఇప్పటికే వీధిల్లో మండపాల ఏర్పాటుతో హడావుడి మొదలైంది.

ఓ పక్క మండపాలకు అనుమతులు తప్పనిసరని పోలీసులు చెబుతున్నారు. ఈ అనుమతులు తీసుకోవడం ఎలా అని ఉత్సవ నిర్వాహకులు ఆలోచన చేయాల్సిన పనిలేదు.

కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పని లేదు. ప్రజలంతా సందడిగా చేసుకునే వినాయకచవితి మండపాల ఏర్పాటుకు అనుమతులప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం సులభతరం చేసింది. ఇందుకోసం సింగిల్ విండో విధానం తీసుకొచ్చింది. దీని కోసం ప్రత్యేక వెబ్‌సైట్ 'గణేష్‌ఉత్సవ్.నెట్ 'రూపొందించింది. ఈ వెబ్‌సైట్ ద్వారా మండపాల నిర్వహకులు సింగల్‌విండో విధానంలో ఆన్‌లైన్‌లోనే అప్లై చేసి అనుమతి తీసుకోవచ్చు. ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

అనుమతిలిలా..

మండపాల నిర్వహకులు గణేష్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. వెబ్‌సైట్ ఓపెన్ కాగానే అప్లై హియర్ అన్న చోట క్లిక్ చేయాలి. తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేయాలి. నమోదు చేసిన ఫోన్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయగానే దరఖాస్తు చేసుకునే పేజీ వస్తుంది. అక్కడ అప్లికేషన్ నింపే వారి పేరు, ఈ-మెయిల్, చిరునామా, సంఘం పేరు నమోదు చేయాలి. వినాయక విగ్రహం ప్రతిష్ఠించే ప్రాంతానికి సంబంధించి జిల్లా, నగరం, సబ్ డివిజన్, ఏరియా పోలీస్‌స్టేషన్ వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. వినాయక విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు కూడా చెప్పాలి. వినాయక విగ్రహాన్ని ఎప్పుడు ఎక్కడ నిమజ్జనం చేస్తారో కూడా ఎంటర్ చేయాలి. విగ్రహం వాహనం ద్వారా తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారా, లేదా మండపం వద్దే నిమజ్జనం చేస్తారనేది తెలియజేయాలి. ఉత్సవాల కమిటీలోని అయిదుగురు సభ్యుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. వివరాలు పూర్తి చేసి సబ్మిట్ చేసిన అప్లికేషన్ సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్తోంది. దీంతో పోలీసులు మండపం ఏర్పాటు చేయుడానికి చిరునామాకు వచ్చి పరిశీలిస్తారు. అక్కడ నిబంధనల ప్రకారం మండపం ఏర్పాటు చేస్తున్నారో లేదో చూస్తారు. వెబ్‌సైట్‌లో నమోదు చేసిన వివరాలు తనిఖీ చేపి అన్నీ సరిగ్గా ఉంటే అప్లికేషన్‌లో నమోదు చేసిన ఫోన్‌కు క్యూఆర్ కోడ్‌తో కూడిన అనుమతి పత్రం వస్తుంది. గణపతి మండపాల అనుమతులు ఈజీ చేయడంతో ఈ ఏడాది నిర్వహకులు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగకుండా ఇంటి నుంచే అనుమతి పొందవచ్చు.

27 నుంచి లక్ష్మీవినాయక ఆలయంలో
వినాయచవితి నవరాత్రి మహోత్సవాలు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధి పోర్టు హాస్పిటల్ జంక్షన్ సమీపంలోని ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన ఉన్న శ్రీ లక్ష్మీవినాయక స్వామి దేవాలయంలో ఈ నెల 27 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు వినాయకచవితి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఒక ప్రకటనను విడుదల చేసింది. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలు నుంచి ఆరు గంటల వరకు అర్చన, హారతి నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులు విభిన్న రూపాల్లో స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. అలాగే, ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత సేవ, శ్రీలక్ష్మీగణపతి హోమం, విశేష అభిషేకం, హారతి, ప్రసాద వితరణ, ఉదయం 9 గంటలకు వేదపారాయణం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రముఖ నాదస్వర విద్వాంసులు, ఆలిండియా రేడియో ఆర్టిస్టు జి. నారాయణ బృందం ఆధ్వర్యంలో నాదస్వరం కార్యక్రమం, 5.30 గంటలకు స్వామి వారి విశేష అలంకారాలతో షోడపచార హారతి దివ్యదర్శనం ఉంటుందన్నారు. అలాగే, ప్రతిరోజూ విభిన్నమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

శాకంబరిదేవిగా విజయదుర్గ



ఆరిలోవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డులో హనుమంతువాక జంక్షన్ సమీపంలో గల విజయదుర్గా కాలనీలో వెలిసిన విజయదుర్గా అమ్మవారిని శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా శాకాంబరీదేవిగా అలంకరించారు. ఈ అలంకరణ కోసం సుమారు 100 మంది కూరగాయలను అందజేశారు. ఆలయ అర్చకులు సంపత్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించారు. భక్తులంతా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి పూజలో పాల్గొన్నారు.

బి-6 మోడల్ టెక్నాలజీపై పూర్తి అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో నూతనంగా చేరనున్న బీ-6 మోడల్ బస్సుల టెక్నాలజీపై డ్రైవర్లకు పూర్తి స్థాయి అవగాహన అవసరమని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. విశాఖ రీజియన్‌లోని 55 మంది డ్రైవర్లు, ఆరుగురు మెకానిక్‌లకు బీ-6 మోడల్ వాహన సాంకేతికత, డ్రైవింగ్‌లో వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా మద్దిలపాలెం డిపో ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ఎం అప్పలనాయుడు మాట్లాడుతూ నగరంలో వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు నూతనంగా బీ-6 మోడల్ బస్సులు రాబోతున్నాయన్నారు. ఇప్పుడు శిక్షణ పొందిన డ్రైవర్లను వాటిలో డ్రైవర్లుగా నియమించడం జరుగుతుందన్నారు. ఈ బీ-6మోడల్ బస్సులు నగర రోడ్లపై కాలుష్యరహితంగా ప్రయాణికులకు రవాణా సేవలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సూపర్‌వైజర్లు మెకానిక్‌లు పాల్గొన్నారు.

నరవ ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు 26వ తేదీ వరకూ గడువు
- 29న కౌన్సెలింగ్

కంచరపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రాంగణంలో గల నరవ ప్రభుత్వ ఐటీఐలో మూడో విడత కౌన్సెలింగ్ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో రెండో విడతలో పలు ట్రేడుల్లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ చేపడతామన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఈ నెల 26 వరకు గడువు ఉందన్నారు. ఎలక్ట్రానిక్, మెకానిక్, ఆర్ అండ్ ఏసీ, డీజిల్ మెకానిక్, ఫిట్టర్ ట్రేడుల్లో కొద్దిపాటి సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐలో తమ సరిఫ్టికెట్లను పరిశీలన చేయించుకుని రసీదును పొందాలని సూచించారు. ఈనెల 29న ఉదయం 10గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

బాలికల ఐటీఐలో సీట్లకు కూడా...

ప్రభుత్వ బాలికల ఐటీఐలో డ్రస్ మేకింగ్, కోపా, సివిల్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ తదితర ట్రేడుల్లో మిగిలిన సీట్లకు అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రమణారావు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు 29న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు, చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సీతమ్మధార, టీపీటీ కాలనీ, లా కాలేజీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-1 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదానంలో అక్రమాలపై ప్రత్యేక విచారణ

- నివేదిక కోరిన కమిషనర్ రామచంద్రమోహన్
- బయోమెట్రిక్ యంత్రాలు పని చేయడం లేదని బొంకులు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన ఆలయంలో అన్నదానం పథకం పక్కదోవ పట్టిందని "ఆంధ్రజ్యోతి" ప్రచురించిన కథనాలపై దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ స్పందించారు. ఇక్కడి ఈఓకు లేఖ రాసి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆలయంలో భక్తుల వివరాలు తీసుకోవడానికి ఇచ్చిన బయోమెట్రిక్ యంత్రాలు పని చేయడం లేదని, అందుకే మాన్యువల్‌గా భక్తుల సంఖ్యను రికార్డ్ చేస్తున్నామని ఈఓ సమాధానం పంపినట్టు తెలిసింది. ఈ యంత్రాలు జూన్ నెల నుంచే పని చేయడం లేదు. అలాగే ఆలయ సిబ్బంది హాజరుకు ఉపయోగించే బయోమెట్రిక్ యంత్రాలు కూడా మొరాయిస్తుండడంతో మార్చాల్సి ఉంది. పత్రికల్లో కథనాలు రావడంతో వాటి స్థానంలో కొత్త యంత్రాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

ప్రతి నెలా సమీక్షిస్తున్నా అదే తీరు

ప్రధాన ఆలయాల్లో అన్నదానం పథకం అమలును ప్రతి నెల కమిషనర్, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్షిస్తున్నారు.

భక్తుల కోసం తయారు చేసే ప్రసాదాలు, అన్నదానం ఆహార పదార్థాల నాణ్యత పరీక్షలు చేయించి, నివేదికలు పంపాలని కోరుతున్నారు. అయితే విశాఖపట్నంలో ఆహార పదార్థాలు, నేయి వంటివి తనిఖీ చేసి నివేదికలు ఇచ్చే లేబరేటరీలు లేవు. దాంతో విజయవాడ దుర్గాదేవి ఆలయం అధికారులు ఎక్కడ పరీక్షలు చేయిస్తున్నారో తెలుసుకొని అక్కడికి ఈ ఆలయం సరకులు పంపడానికి ఏర్పాట్లు చేశారు.

ప్రతి నెలా సక్రమంగా జరగాల్సిన వాటిలోనూ జాప్యం జరుగుతోంది.

విచారణాధికారిగా భ్రమరాంభ

నగరంలోని అన్నదానం నుంచి మామూళ్లు వసూలు చేస్తున్న ఆలయంపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని విజయవాడలో ఉన్నతాధికారి భ్రమరాంభను కమిషనర్ ఆదేశించినట్టు తెలిసింది. ఆలయాల్లో నిర్వహించే అన్నదాన పథకం ఫుడ్ కమిటీలో ఆమె సభ్యురాలు కావడంతో ఆమెకే ఆ బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. ఆమె ఏదో ఒక రోజు ఆకస్మికంగా వచ్చి తనిఖీలు చేపట్టే అవకాశం ఉంది.

ఆలిండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ విజేత ఐసీఎఫ్

- ఐదో స్థానంతో సరిపెట్టుకున్న ఆతిథ్య తూర్పు కోస్తా రైల్వే



విజేత జట్టు ఐసీఎఫ్‌కు బహుమతి ప్రధానం చేస్తున్న తూ.కో. రైల్వే అదనపు జనరల్ మేనేజర్ బీఎస్కే రాజ్‌కుమార్, డీఆర్ఎం లలిత్‌బొహ్రా

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, వాల్తేరు డివిజన్ నిర్వహించిన అఖిల భారత పురుషుల బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) స్వర్ణ పతకంతో పాటు చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నది. సదరన్ రైల్వే రజత పతకం, వెస్టర్న్ రైల్వే కాంస్య పతకం దక్కించుకున్నాయి. ఆతిథ్య తూర్పు కోస్తా రైల్వే జట్టు ఐదో స్థానంతో సరిపెట్టుకున్నది. వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ ఎరీనాలో శుక్రవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి తూర్పు కోస్తా రైల్వే అదనపు జనరల్ మేనేజర్ బీఎస్కే రాజ్‌కుమార్, డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన క్రీడా సదుపాయాలు వాల్తేరు డివిజన్‌లో అందుబాటులో ఉండడం విశేషమన్నారు. క్రీడా కేంద్రంగా రూపొందుతున్న విశాఖలో ఆలిండియా రైల్వే స్థాయి పోటీలు నిర్వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో విజయాల కోసం యువ క్రీడాకారులు ప్రతిభను మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజయ సమల్, వాల్తేరు డివిజన్ అదనపు ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇశాంతరామ్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎం.హరినాథ్, కోశాధికారి కబిర్ అన్సారి, ఆర్ఎస్పీబీ మెంబరు వికాస్ చౌదరి, వాల్తేరు రైల్వే సహాయ క్రీడాధికారులు పాటిల్, సాహు, ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష, బాల్ బ్యాడ్మింటన్‌రాష్ట్ర చైర్మన్ వెంకటరావు పాల్గొన్నారు.

సరోగసీ కేంద్రాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, బృందం సభ్యులు

సీతమ్మధార, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన ఏడుగురు సభ్యుల ఏఆర్‌టీ, సరోగసి బృందం నోవా ఐవీఎఫ్ కేంద్రం (ఏఆర్టీ లెవెల్-2), ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రం (ఎఆర్టీ లెవెల్-2)లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు ఆయా కేంద్రాల వారికి పలు సూచనలు చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డ్, స్కానింగ్ మెషిన్ తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రుల్లో ఏఆర్టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయో, లేదో, డాక్టర్లు, సిబ్బంది విద్యార్హతలు, ల్యాబ్ పరికరాలు పరిశీలించి తగు సలహాలను ఇచ్చారు. ఈ కేంద్రంలో పేదవారికి ఫీజు తగ్గించి తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీ బృందంలో గైనకాలజిస్ట్ డాక్టర్ గీతా వందన, వీజీహెచ్ రేడియోలజిస్ట్ డాక్టర్ రాధ, కేజీహెచ్ పెథాలజిస్ట్ డాక్టర్ టి.కిషోర్, సోషియాలజిస్ట్ డాక్టర్ శోభశ్రీ, ఎన్‌జీవో ప్రతినిధి ఎల్వీ రమణి, మానిటరింగ్ కన్సల్టెంట్ కె.శివాజీ, డీపీఎంవో డాక్టర్ బి.ఉమాపతి, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మారని హోటల్స్ తీరు!

... 5వ పేజీ తరువాయి

20 కిలోల గ్రేవీ (కూర పులుసు) ఉంది. గ్రేవీపై బూజు పట్టడంతోపాటు దుర్వాసన వెదజల్లుతున్నట్టు అధికారులు గుర్తించారు. వీటిపై రెస్టారెంట్ నిర్వాహకులను ప్రశ్నించగా రెండు రోజులు కిందటివిగా అంగీకరించారు. దీంతో కొన్ని నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలను విక్రయించినట్టు నిర్ధారించి కేసు నమోదుచేశారు.

తస్మాత్ జాగ్రత్త..

నగర పరిధిలోని అనేక హోటళ్లు, రెస్టారెంట్స్‌లో ఇదే పరిస్థితి ఉంటోందని అధికారులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నా నిర్వాహకుల్లో మార్పు రావడం లేదని చెబుతున్నారు. ఒకేసారి పెద్దమొత్తంలో వండడం, మిగిలిపోయిన వాటిని మరుసటిరోజు, ఆ మరుసటిరోజు...ఉంచి వేడి చేసి విక్రయించడం పరిపాటిగా మారిందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన ఆహార పదార్థాలను పారవేయడం వల్ల నష్టం వాటిల్లుతుందన్న ఉద్దేశంతో ఇలా చేస్తున్నారని అప్పారావు వెల్లడించారు. కొన్నిచోట్ల కిచెన్‌లో వాతావరణం చాలా అపరిశుభ్రంగా ఉంటున్నదని, అటువంటిచోట్ల వండిన ఆహార పదార్థాలు తినడం వల్ల అనారోగ్యం బారినపడే అవకాశం ఉందన్నారు. ఇకపోతే, కొన్ని హోటల్స్‌లో రుచికోసం, రంగుకోసం ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, రసాయనాలు వినియోగిస్తున్నారన్నారు.

నష్టాల్లోకి విశాఖ ఉక్కు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించడంతో జూలైలో ఉత్పత్తి పెరిగి 5.02 లక్షల టన్నులకు చేరింది. అమ్మకాల విషయానికి వస్తే ఏప్రిల్‌లో రూ.1,482 కోట్లు, మే నెలలో రూ.1,678 కోట్లు, జూన్‌లో రూ.1,636 కోట్లు, జూలైలో రూ.1,9798 కోట్లు విలువైన ఉత్పత్తులు విక్రయించారు.

జూలైలో వెళ్లిపోవాలని ముందుగానే బీఎఫ్-3 ప్రారంభం

స్టీల్‌ప్లాంటుకు ఇన్‌చార్జి సీఎండీగా ఉన్న సక్సేనా బ్లాస్ట్‌ఫర్నేస్-3ను ప్రారంభించేసి జూలై నెలలో సొంత సంస్థకు వెళ్లిపోవాలని భావించారు. నవంబరులో ఆయన రిటైర్‌మెంట్ ఉందని సమాచారం. కాంట్రాక్టు వర్కర్లను వేల సంఖ్యలో తీసేసిన నేపథ్యంలో వర్షాకాలంలో బ్లాస్ట్ ఫర్నేస్-3ను ప్రారంభించడం సరైన నిర్ణయం కాదని ఉద్యోగ వర్గాలు ముందునుంచీ చెబుతున్నాయి. అయితే సీఎండీ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలనే హడావిడిలో దానిని ప్రారంభింపజేశారని, తగినన్ని ముడిపదార్థాలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పుడు పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నారని అంటున్నారు. ఇదిలావుండగా ఒకేసారి 40 విభాగాలను ప్రైవేటుకు ఇవ్వడానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటనలు ఇవ్వడంతో విమర్శలు చెలరేగుతున్నాయి. ఉద్యోగులలో అశాంతిని నెలకొల్పి వెళ్లిపోతానంటే కుదరదని, రిటైర్‌మెంట్ వరకూ ఇక్కడే ఉండాలని ఇన్‌చార్జి సీఎండీని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశించిందని తెలిసింది. ఇప్పుడు ముడి పదార్థాలు అందుబాటులో లేక ఉత్పత్తి తగ్గిపోయింది. మరోవైపు స్టీల్ తయారీకి పెల్లెట్లను, కోక్‌ను బయట కొనడం వల్ల ఉత్పత్తి వ్యయం పది శాతం పెరిగిందనే వాదన గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే వేలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించారని, దానికి తగ్గట్టు వ్యయం ఎందుకు తగ్గలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

వైద్య సిబ్బందికి టీఓటీ శిక్షణ

మహారాణిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయడం వల్ల కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు అవకాశం ఉందని డీఎంహెచ్‌ఓ డా. జగదీశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌సీడీ 4.0 కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి 18 ఏళ్ల పైబడిన ప్రతి మహిళకు స్క్రీనింగ్ టెస్టు నిర్వహించే విధానంపై సిబ్బందికి ఏఎంసీలో శుక్రవారం నుంచి టీఓటీ శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, డాక్టర్ రాధాకుమారి, డాక్టర్ శిల్పా, సాయి సుష్మా, కిరణ్, హారిక, తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్ ఏర్పాటు చేయాలని వినతి

జ్ఞానాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాపురంలో జూబ్లీ పాఠశాల, సోఫియా కళాశాల, జేఎన్ఎన్ఎంయూఆర్ఎం కాలనీ, బాబు కాలనీ ప్రజలకు అందుబాటులో ఉండేలా జూబ్లీ పాఠశాల వద్ద రిక్వెస్టు బస్టాప్ ఏర్పాటు చేయాలని 41వ వార్డు బీజేపీ అధ్యక్షుడు వంకా సంజీవరావు కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఆర్‌టీసీ రీజనల్ మేనేజర్ వినతిపత్రం అందజేశారు.

లడ్డూ విక్రయాలు పునఃప్రారంభం

సాగర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ టీటీడీ ఆలయంలో శుక్రవారం నుంచి లడ్డూ విక్రయాలను పునఃప్రారంభించినట్టు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల భారీ వర్షాలు కారణంగా తిరుపతి నుంచి లడ్డూ రవాణా నిలిచిపోయింది. దీంతో రుషికొండ ఆలయంలో విక్రయాలు నిలిపివేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించి రవాణా సౌకర్యం మెరుగుపడడంతో లడ్డూ లు ఆలయానికి చేరడంతో అమ్మకాలను పునఃప్రారంభించారు.

బోటు షికార్ పునరుద్ధరణ

సాగర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ, ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్న బోటు షికార్‌ను శుక్రవారం నుంచి పునరుద్ధరించారు. బంగాళాఖాతంలో అల్ప పీడనం నేపథ్యంలో ఈనెల 14వ తేదీ నుంచి సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బోటుషికార్‌ను నిలిపివేసిన విషయం తెలి సిందే. ప్రస్తుతం అలల తాకిడి తగ్గడంతో బోటు షికార్‌ను పునరుద్ధరించినట్టు నిర్వాహకులు వెల్లడించారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల అర్హత పత్రాల పరిశీలన

విశాలాక్షినగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కైలాసగిరి ఏఆర్ రిజర్వు పోలీసు గ్రౌండ్‌లో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్. మోహన్‌రావు పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. 659 మంది అభ్యర్థులలో 627 మంది హాజరయ్యారు. 70 మంది మహిళా అభ్యర్థులలో ఒకరు హాజరుకాలేదు. మహిళా అభ్యర్థుల కోసం రెండు కౌంటర్లను అందుబాటులో ఉంచారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సైబర్ సెల్ సీఐ బి.వెంకట్రావు, ఆర్ఐలు మన్మథరావు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



అప్పన్న ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు

కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మహారాణిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు, సుమారు 250 మంది మహిళలు ఈ పూజలో పాల్గొన్నారు. తొలుత ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం జరిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించి, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేపట్టారు. అలాగే వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోనూ శ్రావణ పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పలు బంగారు ఆభరణాలతో మహాలక్ష్మీ అలంకరణలో తయారు చేసి, భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో మహిళలు సామూహిక లలిత సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు.

సింహగిరిపై...

సింహాచలం : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన రాజగోపురం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ముందుగా ప్రకటించిన ప్రకారం తొలి స్లాట్ పూజలకు ఉదయం 7.40 గంటలకు దేవాలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో శ్రీకారం చుట్టారు. మూడు స్లాట్లలో మొత్తం మూడు వేల మంది మహిళలు పాల్గొన్నారు. ఆగమ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. శ్రీకాంతాచార్యులు, వేద పండితులు భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పించి వ్రతాల్లో పాల్గొన్న వారికి తోరగ్రంధి కట్టించారు. అనంతరం అమ్మవారికి షోడశోపచారాలు జరిపించారు. అష్టోత్తర శతనామావళితో కుంకుమార్చన చేశారు. ఈఓ వేంద్ర త్రినాథరావు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేశారు. వ్రతాల్లో పాల్గొన్న వారికి దేవస్థానం సిబ్బంది పూజా సామగ్రి అందజేశారు . కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

30న జనసేన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం

మహారాణిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంలో ఈనెల 30న జనసేన పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన వన్‌టౌన్‌లో ఉన్న ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 30న సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలతో సమావేశం అవుతారని చెప్పారు. సభను విజయవంతం చేయడానికి నాయ కులు బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, బొట్టి వసంత లక్ష్మి, ఉషశ్రీ, బెహరా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, జనసేన నాయకులు



జాబ్‌మేళాకు హాజరైన యువత

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

డాబాగార్డెన్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. పాత జైల్ రోడ్డులోని విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహించాలని ఆదేశించిందన్నారు. నియోజకవర్గంలోని యువత దీన్ని వినియోగించుకోవాలని చెప్పారు. 20 కంపెనీల్లో వెయ్యి మందికి పైగా యువతకు ఉద్యోగాలు కల్పించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి చాముండేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరసనలు, నిలదీతలు...

... 5వ పేజీ తరువాయి

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణకు వీలుగా పిలిచిన టెండర్లను రద్దు చేయాలని, సొంత గనులు కేటాయించాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ రాతపూర్వకంగా మేయర్‌కు వినతిపత్రం ఇవ్వగా, ఆ మేరకు తీర్మానం చేసినట్టు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుపై వైసీపీ నేతలది కపట ప్రేమ అని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు స్టీల్ ప్లాంటు పరిరక్షణకు కనీసం చర్యలు తీసుకోలేదని, బకాయిలను రాష్ట్రప్రభుత్వం తరపున రద్దు చేయాలని కోరితే కుదరదన్నారని గుర్తుచేశారు. అలాంటిది కూటమి ప్రభుత్వం రూ.14 వేల కోట్లు ప్యాకేజీని స్టీల్‌ప్లాంటుకు ప్రకటించి కాపాడేందుకు కృషిచేస్తే, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ డ్రామాలు ఆడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని హామీ ఇచ్చారు. కేవలం సమర్థ ఉత్పత్తి లక్ష్యంగానే 'కాంప్రెహెన్సివ్ కాంట్రాక్ట్ సిస్టమ్'లో భాగంగానే చిన్న చిన్న కాంట్రాక్టర్లను తొలగించి ఒకే కాంట్రాక్టును పిలుస్తున్నారని వివరణ ఇచ్చారు.

అనంతరం కోడి వ్యర్థాల తరలింపు అంశంపై చర్చ జరిగింది. జీవీఎంసీ పరిధిలో కోడి వ్యర్థాల సేకరణకు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లను ఎంపిక చేసినప్పటికీ, అనధికార వ్యక్తులు, రౌడీషీటర్లు కోడి వ్యర్థాలను సేకరించి చేపల చెరువులకు తరలించుకుపోతున్నారని జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రజారోగ్య విభాగం అధికారి కిషోర్ పాత్ర కీలకంగా ఉందని, ఆయన్ను ఐదేళ్లపాటు ఒకేచోట ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. అనధికారికంగా కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను స్వయంగా పట్టుకుని అప్పగించినా చర్యలు తీసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని గంధం శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఉదంతంలో లోతుగా విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్ కేతన్‌గార్గ్ వివరణ ఇస్తూ కోడి వ్యర్థాల తరలింపులో అవకతవకలు జరుగుతున్నమాట వాస్తవమేనని, దీనిని నియంత్రించేందుకు కొద్దిరోజులుగా సాంకేతిక పరిజ్ఞానం సాయం తీసుకుంటున్నామన్నారు. కోడి వ్యర్థాల నిర్వహణకు రెండ్రింగ్ యూనిట్‌ను నెలకొల్పేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామన్నారు.

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు గడువు పూర్తయిపోయినా సరే జీవీఎంసీలో పలు పనులను వారికేఎందుకు అప్పగిస్తున్నారని టీడీపీ, వైసీపీ, జనసేన సభ్యులు ప్రశ్నించారు. రూ.వేల కోట్ల విలువైన పనులు చేస్తున్న స్మార్ట్ సిటీని ఒక ప్రైవేటు ఉద్యోగి నడిపిస్తుండడం, జీవీఎంసీకి పర్యవేక్షణ అధికారం లేకపోవడం సరికాదని, తక్షణం ఆ ప్రాజెక్టులను జీవీఎంసీ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై తగు నివేదిక ఇవ్వాలని అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. నగరంలో రోడ్లను శుభ్రం చేసే వాహనాల నిర్వహణకు రూ.40 కోట్లతో టెండరు పిలిచే ప్రతిపాదనపై జనసేన, టీడీపీ, వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇంతవరకు ఏడాదికాలానికి టెండర్లు పిలిస్తే, ఇప్పుడు ఏకంగా రెండేళ్ల వ్యవధికి పిలవడం, బ్లాక్‌లిస్టులో ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు అనుకూలంగా నిబంధనలు మార్చడంపై సభ్యులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీనిపై స్పందించిన మేయర్ పీలా శ్రీనివాసరావు ఏడాదికాలానికి మాత్రమే టెండర్లు పిలిచేలా టెండరు నిబంధనలు మార్చాలని ఆదేశించారు.

యూసీడీ విభాగం ఆధ్వర్యంలో నగరంలో వీధివిక్రయదారుల కమిటీని నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేశారని, జీవీఎంసీపైనా, అధికారులపైనా కోర్టులో కేసులు వేసిన వ్యక్తులకు కమిటీలో స్థానం ఏ ప్రాతిపదికన ఇచ్చారో చెప్పాలంటూ పీతల మూర్తియాదవ్ ప్రశ్నించారు. అలాగే స్మార్ట్ వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు స్థలాలు ఎంపిక చేయడంపై కూడా సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేయడంతో ఆ అంశాలను వాయిదా వేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. ఎంవీపీ, ఎంకే ప్రాజెక్టు, సిరిపురంలోని ఎంవీవీ పీక్ ప్రాజెక్టులకు దొడ్డిదారిన టీడీఆర్‌లు జారీచేసి జీవీఎంసీకి రూ.కోట్లలో నష్టం కలిగించారని, దీని వెనుక డీటీసీపీ ఆర్జే విద్యుల్లత పాత్ర ఉన్నందున ఆమెపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సీసీపీ ప్రభాకరరావు వివరణ ఇస్తూ టీడీఆర్‌ల జారీ ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతుందని, గత రెండు నెలల్లో కేవలం 35 టీడీఆర్‌లు మాత్రమే జారీచేశామన్నారు. సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు జారీచేసి తర్వాత అబియెన్స్‌లో పెట్టేశారని, వారంతా నిరుపేదలు కాబట్టి తక్షణం వాటిని అబియెన్స్ నుంచి తొలగించి వారికి న్యాయం చేయాలని 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం కోరారు. కొత్తగా ఏర్పాటుచేయనున్న జోనల్ వ్యవస్థలో వార్డుల కేటాయింపు గందరగోళంగా ఉన్నందున పునఃపరిశీలించాలని 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, 69వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నీటి సరఫరా విభాగంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు రూ.వెయ్యి చొప్పున వేతనం పెంచేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మిగిలిన కార్మికులకు కూడా వేతనం పెంపుదలను వర్తింపజేయాలని రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి డిమాండ్ చేశారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

... 5వ పేజీ తరువాయి

చిరంజీవి 82.77 మార్కులతో ద్వితీయ, ఓమ్మి గంగునాయుడు 82.06 మార్కులతో తృతీయ, హిందీలో కురచా జ్యోత్స్న 86.05 మార్కులతో ప్రథమ, రెడ్డి మహాలక్ష్మి 85.05 మార్కులతో ద్వితీయ, మండపాలి ఝాన్సీబాయి 83.07 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

ఇంగ్లీష్‌లో మరడాన శ్రావణి 86.13 మార్కులతో ప్రథమ, కేఎస్‌కేజే ప్రకాష్ 85.72 మార్కులతో ద్వితీయ, దాడి దివ్యపరిమళ 83.9 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో గొర్లె శివరామకృష్ణ 83.5 మార్కులతో ప్రథమ, చిట్టిమూరి వరప్రసాద్ 80.5 మార్కులతో ద్వితీయ, ఎర్ని శివప్రసాద్ 79 మార్కులతో తృతీయ, సోషల్ స్టడీస్‌లో గెంజి రవి 87.28 మార్కులతో ప్రథమ, భవిరిశెట్టి రామకృష్ణ 86.18 మార్కులతో ద్వితీయ, కర్రిరాజు నాగేశ్వరరావు 85.99 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఎస్జీటీ ఉర్దూలో షేక్ వాసింఅక్రమ్ 68.33 మార్కులతో ప్రథమ, పీడీఎస్ జావేద్ బాషా 62.6 మార్కులతో ద్వితీయ, పాలగిరి సానా 53.3 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

జోన్-1 ప్రాతిపదికన పీజీటీ ఫలితాలు వెల్లడి...

మొదట పీజీటీ (పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్స్) రాత పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. జోన్-1 (ఉత్తరాంధ్ర జిల్లాలు) పరిధిలో పీజీటీకి సంబంధించి అన్ని సబ్జెక్టులకూ కలిపి 73 పోస్టులు ఉన్నాయి. పీజీటీ ఇంగ్లీష్ పరీక్ష 1,659 మంది రాయగా వచ్చిన మార్కుల వివరాలను మెరిట్ లిస్టులో పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో పిన్నింటి రవికుమార్ అనే అభ్యర్థి 79.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, మజ్జి భవానీ 79 మార్కులతో రెండో ర్యాంకు, మళ్ల శ్రీను 78.5 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. హిందీ పరీక్ష 726 మంది రాయగా లెంక చక్రపాణి 82.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, కురచా నారాయణమూర్తి 82.5 మార్కులతో రెండో ర్యాంకు, చింతాటి భారతి 82 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. తెలుగు పరీక్ష 2,102 మంది రాయగా పి.ధర్మారావు 85.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, తుమరాడ దుర్గాప్రసాద్ 84.5 మార్కులతో రెండో ర్యాంకు, సరిపల్లి నాగరాజు 83 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. బయాలజీ సైన్స్ 549 మంది రాయగా కాట్రేనుకోన సత్యపావని 77.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, కాలేరపు కిషోర్ 72.5 మార్కులతో ద్వితీయ స్థానం, అల్లైను సౌజన్య 72.5 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. సివిక్స్ (57 మంది)లో బోల్లేజు హరీష్ 76.5 మార్కులతో ప్రథమ స్థానం, బొమ్మిడి డిల్లేశు 69 మార్కులతో రెండో స్థానం, బూరి తవిటినాయుడు 66.5 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. కామర్స్‌లో 81.5 మార్కులతో మద్దాల అనిల్‌కుమార్ ప్రథమ స్థానం, 60.5 మార్కులతో దుద్ది సూర్యనారాయణ ద్వితీయ స్థానం, 59.5 మార్కులతో లింగాల మోహన్ తృతీయస్థానంలో నిలిచారు. గణితం (452 మంది)లో 78.5 మార్కులతో సుంకరాన విజయ, 73.5 మార్కులతో ఆరంగి ధనుంజయరావు, 72 మార్కులతో కొప్పల లక్ష్మణరావు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఫిజికల్ సైన్స్ (420 మంది)లో 74 మార్కులతో నక్కా హరిబాబు, 70 మార్కులతో వెలగల ఎర్రాపాత్రుడు, 68.5 మార్కులతో అల్లు అశోక్‌కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సోషల్ స్టడీస్ (146 మంది)లో కురమాన నిరోషా 85 మార్కులతో ప్రథమ స్థానం, రౌతు పోలినాయుడు 77.5 మార్కులతో ద్వితీయ స్థానం, కిల్లంపల్లి శ్రీకాంత్ 75.5 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

ఏయూలో దివ్యాంగ ఉద్యోగులకు
అధికారి వేధింపులు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని రికార్డు సెక్షన్‌లో పనిచేసే అధికారిణి తన అజమాయిషీలో పనిచేసే పలువురు దివ్యాంగ ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తున్నారు. అధిక మొత్తంలో వడ్డీలకు అప్పు ఇస్తూ మరి కొందరిని కోర్టుల చుట్టూ తిప్పుతున్నట్టు బాధిత ఉద్యోగులు చెబుతున్నారు. ఏయూలోని రికార్డు, టెలీ ఎక్స్ఛేంజ్ విభాగంలో కొందరు దివ్యాంగులు పని చేస్తున్నారు. ఇదే సెక్షన్‌కు చెందిన ఒక అధికారిణి ఉద్యోగుల వైకల్యాన్ని వెక్కిరించేలా మాట్లాడడం, పనులు చేయలేని వారికి ఉద్యోగాలు ఎందుకంటూ అవమానించడం వంటి చేష్టలతో ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆమెకు ఉన్నతాధికారి అండగా ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కంటి చూపులేని ఉద్యోగులు ఖాళీ సమయంలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీసి మానసికంగా వేధిస్తున్నారని వాపోయారు. ఏ పని చేసినా లోపాలు వెతుకుతూ ఆవేదనకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

వర్సిటీలో వడ్డీ వ్యాపారం..

వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా సదరు అధికారిణి యథేచ్ఛగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. పలువురు ఉద్యోగులకు లక్షలాది రూపాయలను భారీ వడ్డీలకు ఇస్తున్నారు. ఖాళీ ప్రామిసరీనోట్లపై సంతకాలు చేయించుకుని ఆమె డబ్బులు ఇస్తుంటారని చెబుతున్నారు. తిరిగి చెల్లించిన తరువాత కూడా డబ్బులు ఇవ్వలేదంటూ వేధిస్తున్నారని వాపోయారు. అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్న సదరు అధికారిణిని కట్టడి చేయాలని పలువురు ఉద్యోగులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

యాచకులకు ఆశ్రయం



యాచకులను రెడ్‌క్రాస్ సొసైటీలో త్రీటౌన్ పోలీసులు

మద్దిలపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మూడోపట్టణ పోలీసులు శుక్రవారం బెగ్గర్స్ ఫ్రీ విశాఖ సిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఐ పైడయ్య ఆధ్వర్యంలో అశీల్‌మెట్ట సంపత్ వినాయక ఆలయం వద్ద బిక్షం, డబ్బులు అడుక్కుంటున్న యాచకులను శుభ్రం చేసి పెదవాల్తేరులోని రెడ్ క్రాస్ సొసైటీలో చేర్పించారు.

ఈ సందర్భంగా సీఐ పైడయ్య మాట్లాడుతూ యాచకులు లేని నగరంగా విశాఖను తీర్చిదిద్దడానికి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యాచకులను గుర్తించి వారికి వసతి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24,టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 38, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 26, బీరకాయలు 44, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 30, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 74, బరబాటి 38, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 72, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరుచిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	101
లైవ్ ధర	121
విత్ స్కిన్	212
స్కిన్‌లెస్	222

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వరలక్ష్మి వ్రతాలు ఆచరించిన మహిళలు



ఎంవీపీ కాలనీ : సత్యసాయి మందిర్ వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిరంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. భారీగా హాజరైన మహిళా భక్తులతో సమూహ ప్రార్థనలు నిర్వహించారు. వేదపఠనం, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బాలవికాస్ గురువుల సమక్షంలో వ్రతం నిర్వహించారు. భగవాన్ సత్యసాయిబాబా ప్రబోధించిన సమస్తలోకాః సుఖినోభవంతు సందేశాన్ని ప్రతిబింబిస్తూ ఈ వ్రతం చేశారు. మంగళ హారతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. విశాఖ సిటీ సత్యసాయిసేవా సమితి, మహిళా యువ విభాగం ప్రతినిధులు లావణ్య, సాయికుమార్ తదితరులు పర్యవేక్షించారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని 16వ వార్డు సంజయ్ గాంధీ కాలనీ కనకదుర్గా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక శ్రావణ లక్ష్మి పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో అభిషేకాన్ని జరిపి, అనంతరం పుష్పాలు, గాజులతో అలంకరించారు. మహిళలంతా తమ ఇంటిలో పూజలు నిర్వహించుకొని, ఆలయానికి వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన జరిపారు. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీరామానంద ఆశ్రమం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలోని వేంచేసి ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హెచ్‌బీ కాలనీలోని బహుముఖ గాయత్రి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని సాయంత్రం లలితా సహస్ర నామాలను మహిళలు పఠించారు. గాయత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మంత్రాలను జపించారు.



సంజయ్ గాంధీ కాలనీలో దుర్గాదేవికి పూజలు

బీచ్ రోడ్డులో కూలిన రిటైనింగ్ వాల్

- తీరం కోతకు గురవడంతో తలెత్తిన సమస్య



బీచ్ రోడ్డులో రిటైనింగ్ వాల్ కూలిన దృశ్యం

బీచ్ రోడ్డు, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్ రోడ్డులో తీరం వెంబడి దాదాపు అర కిలో మీటర్ మేర కోతకు గురి కావడంతో రిటైనింగ్ వాల్ కూలిపోయింది. గతంలో సబ్‌మెరైన్ పార్కు హోటల్ వద్ద ఇదే పరిస్థితి నెలకొనగా, కోత నివారణకు కొబ్బరి చెట్లు పాతి బరువైన పెద్ద రాళ్లను ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇక్కడ మళ్లీ తీరం కోతకు గురైంది. రిటైనింగ్ వాల్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. బీచ్‌రోడ్డు కొంత లోతట్టుగా ఉంటుంది. దీంతో ఆటుపోట్లు, తుపాన్ల సమయంలో అలలు తీరం వైపు బాగా ముందుకు వస్తాయి. గతంలో ఇక్కడ రక్షణ గోడ ఉండడంతో అలలు ఎంత వేగంగా వచ్చినా పెద్దగా సమస్య ఉండేది కాదు. క్రమంగా గోడ దెబ్బ తింటూ వచ్చింది. ఆ పరిస్థితిలో అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో గోడ పూర్తిగా పడిపోయింది. ఇక అప్పటి నుంచి తీరం కోతకు గురవుతూ వస్తోంది. తుపాన్ సమయంలో అలలు రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మురళి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులు పందిర్ల ఏర్పాటుకు కచ్చితంగా అనుమతి తీసుకోవాలని ఎంవీపీ కాలనీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మురళి స్పష్టం చేశారు. నిర్వాహకులు నిబంధనలను అనుసరించి మాత్రమే ఉత్సవాలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఇటీవల నిబంధనలను ప్రకటించారని, ఆ ప్రకారం తగిన అనుమతితో పందిర్లు వేసుకోవాలని సూచించారు. ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా అనుమతుల కోసం ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలను అమర్చాలని తెలిపారు. వీటిని పోలీసుల కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించాల్సి ఉంటుందన్నారు. రహదారుల్లో వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకూడదని, రహదారులను తవ్వకూడదన్నారు. అనుపు కార్యక్రమానికి కూడా కొన్ని మార్గదర్శకాలు ఉంటాయన్నారు. గణేష్‌ఉత్సవ్ డాట్ నెట్‌లో అన్ని వివరాలను నమోదు చేయాలని తెలిపారు. నిర్వాహకుల వివరాలు కూడా అందించాల్సి ఉంటుందని, అలాగే విద్యుత్తు సరఫరా అనుమతి కూడా ఉండాలని తెలిపారు. డీజేలు పెట్టి, శబ్ద కాలుష్యానికి అనుమతిలేదని స్పష్టం చేశారు. అనుమతుల్లేకుండా నిర్వహించే ఉత్సవ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం





సమతా కళాశాలలో మట్టి వినాయక ప్రతిమలను తయారుచేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగించవద్దని, మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దామని విద్యార్థినులు నినదించారు. ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులతో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, కళాశాల డైరక్టర్ డాక్టర్ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుడికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గత కొన్నేళ్ల నుంచి డైమండ్ పార్కు సమీపంలోని రోడ్డుపై దిక్కుతోచని స్థితిలో ఉన్న సురేష్ (38) అనే నిరాశ్రయుడికి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. కాలికి తగిలిన గాయంతో గత కొన్నేళ్ల నుంచి రోడ్డుపైనే ఉంటున్న ఆయనను చూసిన ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్సై బీశెట్టి వెంకటేశ్వరరావు స్పందించి ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహం సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే స్పందించిన గృహం సిబ్బంది సకాలంలో వచ్చి ప్రథమ చికిత్స అందించి వసతిగృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు.

సమావేశాల్లో నిర్ణయాలపై తక్షణ చర్యలకు కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్షా మండలి, దిశా సమావేశాల్లో ప్రస్తావించిన అంశాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ హౌసింగ్, ఈపీడీసీఎల్, జీవీఎంసీ, మహిళా, శిశు సంక్షేమశాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలకు చెందిన అంశాలపై ప్రగతి నివేదికలు వెంటనే అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో కొందరు ప్రభుత్వ పాఠశాలల్లో చేరలేదంటూ గతంలో దిశ సమావేశంలో చర్చకు వచ్చిన విషయం గుర్తుచేస్తూ, దీనిపై నివేదిక ఇవ్వాలన్నారు.టిడ్కో ఇళ్లు పొందలేని వారికి వెంటనే వారి ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీశంకర్, సీపీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి,ఇతరఅధికారులు పాల్గొన్నారు.

భర్త హత్య కేసులో జీవిత ఖైదు

విజయనగరం క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో 2015లో నమోదైన హత్య కేసు నిందితురాలు విశాఖ జిల్లా భీమిలి మండలం నగరపాలెం గ్రామానికి చెందిన గారి వెంకట జ్యోతిర్మయికి జీవితఖైదు విధిస్తూ విజయనగరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి బి.అప్పలస్వామి తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. అదే మండలం కాపులదిబ్బవాని పాలెంకు చెందిన చొక్కా నరేష్, ఉప్పాడకు చెందిన పాడ రాజు అలియాస్ ముక్కు అనే ఇద్దరు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించినట్టు తెలిపారు. వెంకట జ్యోతిర్మయికి రమేష్ అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు ఆనందపురం మండలం బొడ్డుపాలెం గ్రామంలో నివాసం ఉండేవారు. భర్త గార రమేష్‌కు సీమేన్‌గా ఉద్యోగం రావడంతో శిక్షణ నిమిత్తం 2015లో చైన్నై వెళ్లిపోయారు. భార్య వెంకట జ్యోతిర్మయికి భీమిలి మండలం కాపుల దిబ్బవాని పాలెంనకు చెందిన రాగాతి రాము అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. భర్త రమేష్ శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన తరువాత వీరి విషయాన్ని గుర్తించి భార్యను ప్రశ్నించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదాలు జరిగేవి. దీంతో రమేష్‌ను అడ్డు తొలగించేందుకు నిందితులు ప్రణాళిక రూపొందించారు. 2015 జూలై 26న రమేష్ తన భార్య వెంకట జ్యోతిర్మయిని ఇదే విషయమై ప్రశ్నించగా, తన ప్రియుడు రాగాతి రాముకు ఫోన్ చేసి రప్పించింది. తలుపు చెక్కతో భర్త రమేష్ తలపై కొట్టగా అక్కడిక్కడే మృతి చెందాడు. దీన్ని జ్యోతిర్మయి రెండో కుమార్తె సౌమ్య చూసింది. చొక్కా నరేష్, రాజు అనే వ్యక్తుల సహకారంతో రాగాతి రాము, జ్యోతిర్మయి.. రమేష్ మృతదేహాన్ని అర్ధరాత్రి భీమిలి బీచ్‌కు తీసుకువెళ్లి పెట్రోలు పోసి కాల్చేశారు. అనంతరం రెండో కుమార్తె సౌమ్యను పూల్‌బాగ్ లోని ఓ బావిలో పడేసి చంపేశారు. ఈ విషయం టూటౌన్ పోలీసులకు తెలిసి కేసు నమోదు చేశారు. నిందితులు నలుగురిని అప్పటి టూటౌన్ సీఐ అంబేడ్కర్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన సీఐలు దుర్గాప్రసాద్, విజయానంద్, రామారావు దర్యాప్తు చేపట్టి నిందితులపై అభియోగ పత్రాలు దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ టి.శ్రీనివాసరావు కేసును పర్యవేక్షిస్తూ న్యాయస్థానంలో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో నిందితులకు శిక్ష ఖరారు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. రాగాతి రాము అనే నిందితుడు కేసు విచారణలో ఉండగానే రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. దీంతో కోర్టు మిగతా ముగ్గురికి శిక్ష ఖరారు చేసింది.

ఎస్సీ యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ఎస్సీ యువతకు పీఎంజే పథకంలో భాగంగా హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ అందించనున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన 10 మంది పురుషులు, అయిదుగురు మహిళలకు ఈ అవకాశం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. నలభై రోజుల పాటు ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా నివాసులై, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు జతచేసి, దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. 20 ఏళ్ల వయసు పైబడి, కనీసం ఏడాది కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని, 40 ఏళ్ల దాటిన వారు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాలని తెలిపారు. హెచ్‌ఎంవీ ఎల్‌ఎల్‌ఆర్ పొందడానికి రూ.210లు, హెవీ వెహికల్ లైసెన్స్ పొందటానికి రూ. 1060లు అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన యువతీయువకులు ఎంవీపీ కాలనీలోని జిల్లా షెడ్యుల్డు కులాల సేవా సహకార సంస్థ, సంక్షేమ భవన్ కార్యాలయానికి ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని ఆమె తెలిపారు.

ఏయూలో విద్యార్థుల రక్తదానం



ఏయూ కెమిస్ట్రీ విభాగంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు, పాల్గొన్న ఆచార్యులు, ఈశ్వరీ విశ్వవిద్యాలయ ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ, కేజీహెచ్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా శుక్రవారం ఏయూ కెమిస్ట్రీ విభాగంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏయూ ఆచార్యులు బీవీవీ శైలజ, డి.సంధ్యాదీపిక, బ్రహ్మకుమారీలు శివలీల, జ్యోత్స్న, కేజీహెచ్ వైద్య బృందం పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి



దాడికి పాల్పడిన ప్రసాద్

ఆరిలోవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :శ్రీకాంత్‌నగర్ లేఅవుట్ సమీపంలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం బొట్టా పృథ్వీరాజ్ (25)పై అదే ప్రాంతానికి చెందిన మేడ ప్రసాద్ (19) కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో పృథ్వీరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ వై.కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుడ్ని ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వివాహ సంబంధం నేపథ్యంలో ఈ దాడి జరిగినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

13వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వినతి

ఆరిలోవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో పలు అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ కెల్ల సునీతాసత్యనారాయణ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి పత్రం అందజేశారు. ముడసర్లోవ పార్కు అభివృద్ధి, నీటి గ్యాలరీ ఆధునీకకరణ, శ్రీకాంత్‌నగర్, పైనాపిల్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ప్రజలకు మంచి తాగునీరు అందించడం, ఆర్వో ప్లాంటుల ఏర్పాటు, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురంలో వీధి కాలువలు, రోడ్లు ఏర్పాటు, రామకృష్ణాపురంలో మిగిలి సీసీ రోడ్డు నిర్మాణం, శ్రీకాంత్‌నగర్‌లో గల సామాజిక భవన నిర్మాణం పూర్తి చేయడం తదితర సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

గణపతి మండపాల ఏర్పాటుకు
అనుమతుల ప్రక్రియ సులభతరం

- సింగిల్ విండో విధానం అమలు
- ప్రత్యేక వెబ్‌సైట్ : geneshutsav.net రూపకల్పన
- ఇంటి నుంచే అనుమతులు పొందే అవకాశం



మద్దిలపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి పండుగ అంటేనే కోలాహలం. వీధిల్లో ఒకటే సందడి.. ఇందుకోసం నగరంలోని వీధివీధిలో గణపతి మండపాలు వెలుస్తాయి. ఈ మండపాలు ఏర్పాటు చేయాలంటే జీవీఎంసీ, పోలీస్, ఫైర్.. ఇలా వివిధ శాఖల అనుమతులు పొందాల్సి వచ్చేది. చవితికి ఇంకా అయిదు రోజులే ఉంది. ఇప్పటికే వీధిల్లో మండపాల ఏర్పాటుతో హడావుడి మొదలైంది.

ఓ పక్క మండపాలకు అనుమతులు తప్పనిసరని పోలీసులు చెబుతున్నారు. ఈ అనుమతులు తీసుకోవడం ఎలా అని ఉత్సవ నిర్వహకులు ఆలోచన చేయాల్సిన పనిలేదు.

కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పని లేదు. ప్రజలంతా సందడిగా చేసుకునే వినాయకచవితి మండపాల ఏర్పాటుకు అనుమతులప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం సులభతరం చేసింది. ఇందుకోసం సింగిల్ విండో విధానం తీసుకొచ్చింది. దీని కోసం ప్రత్యేక వెబ్‌సైట్ 'గణేష్‌ఉత్సవ్.నెట్ 'రూపొందించింది. ఈ వెబ్‌సైట్ ద్వారా మండపాల నిర్వహకులు సింగల్‌విండో విధానంలో ఆన్‌లైన్‌లోనే అప్లై చేసి అనుమతి తీసుకోవచ్చు. ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

అనుమతిలిలా..

మండపాల నిర్వహకులు గణేష్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. వెబ్‌సైట్ ఓపెన్ కాగానే అప్లై హియర్ అన్న చోట క్లిక్ చేయాలి. తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేయాలి. నమోదు చేసిన ఫోన్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయగానే దరఖాస్తు చేసుకునే పేజీ వస్తుంది. అక్కడ అప్లికేషన్ నింపే వారి పేరు, ఈ-మెయిల్, చిరునామా, సంఘం పేరు నమోదు చేయాలి. వినాయక విగ్రహం ప్రతిష్ఠించే ప్రాంతానికి సంబంధించి జిల్లా, నగరం, సబ్ డివిజన్, ఏరియా పోలీస్‌స్టేషన్ వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. వినాయక విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు కూడా చెప్పాలి. వినాయక విగ్రహాన్ని ఎప్పుడు ఎక్కడ నిమజ్జనం చేస్తారో కూడా ఎంటర్ చేయాలి. విగ్రహం వాహనం ద్వారా తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారా, లేదా మండపం వద్దే నిమజ్జనం చేస్తారనేది తెలియజేయాలి. ఉత్సవాల కమిటీలోని అయిదుగురు సభ్యుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. వివరాలు పూర్తి చేసి సబ్మిట్ చేసిన అప్లికేషన్ సంబందిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్తోంది. దీంతో పోలీసులు మండపం ఏర్పాటు చేయడానికి చిరునామాకు వచ్చి పరిశీలిస్తారు. అక్కడ నిబంధనల ప్రకారం మండపం ఏర్పాటు చేస్తున్నారో లేదో చూస్తారు. వెబ్‌సైట్‌లో నమోదు చేసిన వివరాలు తనిఖీ చేసి అన్నీ సరిగ్గా ఉంటే అప్లికేషన్‌లో నమోదు చేసిన ఫోన్‌కు క్యూఆర్ కోడ్‌తో కూడిన అనుమతి పత్రం వస్తుంది. గణపతి మండపాల అనుమతులు ఈజీ చేయడంతో ఈ ఏడాది నిర్వహకులు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగకుండా ఇంటి నుంచే అనుమతి పొందవచ్చు.

27 నుంచి లక్ష్మీవినాయక ఆలయంలో
వినాయచవితి నవరాత్రి మహోత్సవాలు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధి పోర్టు హాస్పిటల్ జంక్షన్ సమీపంలోని ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన ఉన్న శ్రీ లక్ష్మీవినాయక స్వామి దేవాలయంలో ఈ నెల 27 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు వినాయకచవితి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఒక ప్రకటనను విడుదల చేసింది. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలు నుంచి ఆరు గంటల వరకు అర్చన, హారతి నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులు విభిన్న రూపాల్లో స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. అలాగే, ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత సేవ, శ్రీలక్ష్మీగణపతి హోమం, విశేష అభిషేకం, హారతి, ప్రసాద వితరణ, ఉదయం 9 గంటలకు వేదపారాయణం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రముఖ నాదస్వర విద్వాంసులు, ఆలిండియా రేడియో ఆర్టిస్టు జి. నారాయణ బృందం ఆధ్వర్యంలో నాదస్వరం కార్యక్రమం, 5.30 గంటలకు స్వామి వారి విశేష అలంకారాలతో షోడపచార హారతి దివ్యదర్శనం ఉంటుందన్నారు. అలాగే, ప్రతిరోజూ విభిన్నమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

శాకంబరిదేవిగా విజయదుర్గ



ఆరిలోవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డులో హనుమంతువాక జంక్షన్ సమీపంలో గల విజయదుర్గా కాలనీలో వెలిసిన విజయదుర్గా అమ్మవారిని శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా శాకాంబరీదేవిగా అలంకరించారు. ఈ అలంకరణ కోసం సుమారు 100 మంది కూరగాయలను అందజేశారు. ఆలయ అర్చకులు సంపత్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించారు. భక్తులంతా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి పూజలో పాల్గొన్నారు.

బి-6 మోడల్ టెక్నాలజీపై పూర్తి అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో నూతనంగా చేరనున్న బి-6 మోడల్ బస్సుల టెక్నాలజీపై డ్రైవర్లకు పూర్తి స్థాయి అవగాహన అవసరమని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. విశాఖ రీజియన్‌లోని 55 మంది డ్రైవర్లు, ఆరుగురు మెకానిక్‌లకు బి-6 మోడల్ వాహన సాంకేతికత, డ్రైవింగ్‌లో వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా మద్దిలపాలెం డిపో ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ఎం అప్పలనాయుడు మాట్లాడుతూ నగరంలో వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు నూతనంగా బి-6 మోడల్ బస్సులు రాబోతున్నాయన్నారు. ఇప్పుడు శిక్షణ పొందిన డ్రైవర్లను వాటిలో డ్రైవర్లుగా నియమించడం జరుగుతుందన్నారు. ఈ బి-6మోడల్ బస్సులు నగర రోడ్లపై కాలుష్యరహితంగా ప్రయాణికులకు రవాణా సేవలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సూపర్‌వైజర్లు మెకానిక్‌లు పాల్గొన్నారు.

నరవ ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు 26వ తేదీ వరకూ గడువు
- 29న కౌన్సెలింగ్

కంచరపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రాంగణంలో గల నరవ ప్రభుత్వ ఐటీఐలో మూడో విడత కౌన్సెలింగ్ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో రెండో విడతలో పలు ట్రేడుల్లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ చేపడతామన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఈ నెల 26 వరకు గడువు ఉందన్నారు. ఎలక్ట్రానిక్, మెకానిక్, ఆర్ అండ్ ఏసీ, డీజిల్ మెకానిక్, ఫిట్టర్ ట్రేడుల్లో కొద్దిపాటి సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐలో తమ సరిఫికెట్లను పరిశీలన చేయించుకుని రసీదును పొందాలని సూచించారు. ఈనెల 29న ఉదయం 10గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

బాలికల ఐటీఐలో సీట్లకు కూడా...

ప్రభుత్వ బాలికల ఐటీఐలో డ్రస్ మేకింగ్, కోపా, సివిల్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ తదితర ట్రేడుల్లో మిగిలిన సీట్లకు అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రమణారావు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు 29న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు, చెట్లు కొమ్మల తొలగింపు చేపడుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సీతమ్మధార, టీపీటీ కాలనీ, లా కాలేజీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-1 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదానంలో అక్రమాలపై ప్రత్యేక విచారణ

- నివేదిక కోరిన కమిషనర్ రామచంద్రమోహన్
- బయోమెట్రిక్ యంత్రాలు పని చేయడం లేదని బొంకులు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన ఆలయంలో అన్నదానం పథకం పక్కదోవ పట్టిందని "ఆంధ్రజ్యోతి" ప్రచురించిన కథనాలపై దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ స్పందించారు. ఇక్కడి ఈఓకు లేఖ రాసి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆలయంలో భక్తుల వివరాలు తీసుకోవడానికి ఇచ్చిన బయోమెట్రిక్ యంత్రాలు పని చేయడం లేదని, అందుకే మాన్యువల్‌గా భక్తుల సంఖ్యను రికార్డ్ చేస్తున్నామని ఈఓ సమాధానం పంపినట్టు తెలిసింది. ఈ యంత్రాలు జూన్ నెల నుంచే పని చేయడం లేదు. అలాగే ఆలయ సిబ్బంది హాజరుకు ఉపయోగించే బయోమెట్రిక్ యంత్రాలు కూడా మొరాయిస్తుండడంతో మార్చాల్సి ఉంది. పత్రికల్లో కథనాలు రావడంతో వాటి స్థానంలో కొత్త యంత్రాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

ప్రతి నెలా సమీక్షిస్తున్నా అదే తీరు

ప్రధాన ఆలయాల్లో అన్నదానం పథకం అమలును ప్రతి నెల కమిషనర్, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్షిస్తున్నారు.

భక్తుల కోసం తయారు చేసే ప్రసాదాలు, అన్నదానం ఆహార పదార్థాల నాణ్యత పరీక్షలు చేయించి, నివేదికలు పంపాలని కోరుతున్నారు. అయితే విశాఖపట్నంలో ఆహార పదార్థాలు, నేయి వంటివి తనిఖీ చేసి నివేదికలు ఇచ్చే లేబరేటరీలు లేవు. దాంతో విజయవాడ దుర్గాదేవి ఆలయం అధికారులు ఎక్కడ పరీక్షలు చేయిస్తున్నారో తెలుసుకొని అక్కడికి ఈ ఆలయం సరకులు పంపడానికి ఏర్పాట్లు చేశారు.

ప్రతి నెలా సక్రమంగా జరగాల్సిన వాటిలోనూ జాప్యం జరుగుతోంది.

విచారణాధికారిగా భ్రమరాంభ

నగరంలోని అన్నదానం నుంచి మామూళ్లు వసూలు చేస్తున్న ఆలయంపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని విజయవాడలో ఉన్నతాధికారి భ్రమరాంభను కమిషనర్ ఆదేశించినట్టు తెలిసింది. ఆలయాల్లో నిర్వహించే అన్నదాన పథకం ఫుడ్ కమిటీలో ఆమె సభ్యురాలు కావడంతో ఆమెకే ఆ బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. ఆమె ఏదో ఒక రోజు ఆకస్మికంగా వచ్చి తనిఖీలు చేపట్టే అవకాశం ఉంది.

ఆలిండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ విజేత ఐసీఎఫ్

- ఐదో స్థానంతో సరిపెట్టుకున్న ఆతిథ్య తూర్పు కోస్తా రైల్వే


విజేత జట్టు ఐసీఎఫ్‌కు బహుమతి ప్రధానం చేస్తున్న తూ.కో. రైల్వే అదనపు జనరల్ మేనేజర్ బీఎస్కే.రాజ్‌కుమార్, డీఆర్‌ఎం లలిత్‌బొహ్రా

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్, వాల్తేరు డివిజన్ నిర్వహించిన అఖిల భారత పురుషుల బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) స్వర్ణ పతకంతో పాటు చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నది. సదరన్ రైల్వే రజత పతకం, వెస్ట్రన్ రైల్వే కాంస్య పతకం దక్కించుకున్నాయి. ఆతిథ్య తూర్పు కోస్తా రైల్వే జట్టు ఐదో స్థానంతో సరిపెట్టుకున్నది. వాల్తేరు రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో శుక్రవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి తూర్పు కోస్తా రైల్వే అదనపు జనరల్ మేనేజర్ బీఎస్కే రాజ్‌కుమార్, డీఆర్‌ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన క్రీడా సదుపాయాలు వాల్తేరు డివిజన్‌లో అందుబాటులో ఉండడం విశేషమన్నారు. క్రీడా కేంద్రంగా రూపొందుతున్న విశాఖలో ఆలిండియా రైల్వే స్థాయి పోటీలు నిర్వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో విజయాల కోసం యువ క్రీడాకారులు ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజయ సమల్, వాల్తేరు డివిజన్ అదనపు ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇశాంతరామ్, స్పోర్ట్సు ఆఫీసర్ ఎం.హరినాథ్, కోశాధికారి కబిర్ అన్సారి, ఆర్‌ఎస్పీబీ మెంబరు వికాస్ చౌదరి, వాల్తేరు రైల్వే సహాయ క్రీడాధికారులు పాటిల్, సాహు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష, బాల్ బ్యాడ్మింటన్‌రాష్ట్ర చైర్మన్ వెంకటరావు పాల్గొన్నారు.

సరోగసీ కేంద్రాల్లో తనిఖీలు


తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, బృందం సభ్యులు

సీతమ్మధార, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన ఏడుగురు సభ్యుల ఏఆర్‌టీ, సరోగసి బృందం నోవా ఐవీఎఫ్ కేంద్రం (ఏఆర్టీ లెవెల్-2), ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రం (ఎఆర్టీ లెవెల్-2)లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు ఆయా కేంద్రాల వారికి పలు సూచనలు చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డ్, స్కానింగ్ మెషిన్ తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రుల్లో ఏఆర్టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయో, లేదో, డాక్టర్లు, సిబ్బంది విద్యార్హతలు, ల్యాబ్ పరికరాలు పరిశీలించి తగు సలహాలను ఇచ్చారు. ఈ కేంద్రంలో పేదవారికి ఫీజు తగ్గించి తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీ బృందంలో గైనకాలజిస్ట్ డాక్టర్ గీతా వందన, వీజీహెచ్ రేడియోలజిస్ట్ డాక్టర్ రాధ, కేజీహెచ్ పెథాలజిస్ట్ డాక్టర్ టి.కిషోర్, సోషియాలజిస్ట్ డాక్టర్ శోభశ్రీ, ఎన్‌జీవో ప్రతినిధి ఎల్వీ రమణి, మానిటరింగ్ కన్సల్టెంట్ కె.శివాజీ, డీపీఎంవో డాక్టర్ బి.ఉమాపతి, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మారని హోటల్స్ తీరు!

... 5వ పేజీ తరువాయి

20 కిలోల గ్రేవీ (కూర పులుసు) ఉంది. గ్రేవీపై బూజు పట్టడంతోపాటు దుర్వాసన వెదజల్లుతున్నట్టు అధికారులు గుర్తించారు. వీటిపై రెస్టారెంట్ నిర్వాహకులను ప్రశ్నించగా రెండు రోజులు కిందటివిగా అంగీకరించారు. దీంతో కొన్ని నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలను విక్రయించినట్టు నిర్ధారించి కేసు నమోదుచేశారు.

తస్మాత్ జాగ్రత్త..

నగర పరిధిలోని అనేక హోటళ్లు, రెస్టారెంట్స్‌లో ఇదే పరిస్థితి ఉంటోందని అధికారులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నా నిర్వాహకుల్లో మార్పు రావడం లేదని చెబుతున్నారు. ఒకేసారి పెద్దమొత్తంలో వండడం, మిగిలిపోయిన వాటిని మరుసటిరోజు, ఆ మరుసటిరోజు...ఉంచి వేడి చేసి విక్రయించడం పరిపాటిగా మారిందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన ఆహార పదార్థాలను పారవేయడం వల్ల నష్టం వాటిల్లుతుందన్న ఉద్దేశంతో ఇలా చేస్తున్నారని అప్పారావు వెల్లడించారు. కొన్నిచోట్ల కిచెన్‌లో వాతావరణం చాలా అపరిశుభ్రంగా ఉంటున్నదని, అటువంటిచోట్ల వండిన ఆహార పదార్థాలు తినడం వల్ల అనారోగ్యం బారినపడే అవకాశం ఉందన్నారు. ఇకపోతే, కొన్ని హోటల్స్‌లో రుచికోసం, రంగుకోసం ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, రసాయనాలు వినియోగిస్తున్నారన్నారు.

నష్టాల్లోకి విశాఖ ఉక్కు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించడంతో జూలైలో ఉత్పత్తి పెరిగి 5.02 లక్షల టన్నులకు చేరింది. అమ్మకాల విషయానికి వస్తే ఏప్రిల్‌లో రూ.1,482 కోట్లు, మే నెలలో రూ.1,678 కోట్లు, జూన్‌లో రూ.1,636 కోట్లు, జూలైలో రూ.1,9798 కోట్లు విలువైన ఉత్పత్తులు విక్రయించారు.

జూలైలో వెళ్లిపోవాలని ముందుగానే బీఎఫ్-3 ప్రారంభం

స్టీల్‌ప్లాంటుకు ఇన్‌చార్జి సీఎండీగా ఉన్న సక్సేనా బ్లాస్ట్‌ఫర్నేస్-3ను ప్రారంభించేసి జూలై నెలలో సొంత సంస్థకు వెళ్లిపోవాలని భావించారు. నవంబరులో ఆయన రిటైర్‌మెంట్ ఉందని సమాచారం. కాంట్రాక్టు వర్కర్లను వేల సంఖ్యలో తీసేసిన నేపథ్యంలో వర్షాకాలంలో బ్లాస్ట్ ఫర్నేస్-3ను ప్రారంభించడం సరైన నిర్ణయం కాదని ఉద్యోగ వర్గాలు ముందునుంచీ చెబుతున్నాయి. అయితే సీఎండీ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలనే హడావిడిలో దానిని ప్రారంభింపజేశారని, తగినన్ని ముడిపదార్థాలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పుడు పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నారని అంటున్నారు. ఇదిలావుండగా ఒకేసారి 40 విభాగాలను ప్రైవేటుకు ఇవ్వడానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటనలు ఇవ్వడంతో విమర్శలు చెలరేగుతున్నాయి. ఉద్యోగులలో అశాంతిని నెలకొల్పి వెళ్లిపోతానంటే కుదరదని, రిటైర్‌మెంట్ వరకూ ఇక్కడే ఉండాలని ఇన్‌చార్జి సీఎండీని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశించిందని తెలిసింది. ఇప్పుడు ముడి పదార్థాలు అందుబాటులో లేక ఉత్పత్తి తగ్గిపోయింది. మరోవైపు స్టీల్ తయారీకి పెల్లెట్లను, కోక్‌ను బయట కొనడం వల్ల ఉత్పత్తి వ్యయం పది శాతం పెరిగిందనే వాదన గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే వేలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించారని, దానికి తగ్గట్టు వ్యయం ఎందుకు తగ్గలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

వైద్య సిబ్బందికి టీఓటీ శిక్షణ

మహారాణిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయడం వల్ల కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు అవకాశం ఉందని డీఎంహెచ్‌ఓ డా. జగదీశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌సీడీ 4.0 కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి 18 ఏళ్ల పైబడిన ప్రతి మహిళకు స్క్రీ నింగ్ టెస్టు నిర్వహించే విధానంపై సిబ్బందికి ఏఎంసీలో శుక్రవారం నుంచి టీఓటీ శిక్షణను ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, డాక్టర్ రాధాకుమారి, డాక్టర్ శిల్పా, సాయి సుష్మా, కిరణ్, హారిక, తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్ ఏర్పాటు చేయాలని వినతి

జ్ఞానాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాపురంలో జూబ్లి పాఠశాల, సోఫియా కళాశాల, జేఎన్‌ఎన్‌ఎంయూఆర్‌ఎం కాలనీ, బాబు కాలనీ ప్రజలకు అందుబాటులో ఉండేలా జూబ్లి పాఠశాల వద్ద రిక్వెస్టు బస్టాప్ ఏర్పాటు చేయాలని 41వ వార్డు బీజేపీ అధ్యక్షుడు వంకా సంజీవరావు కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వినతిపత్రం అందజేశారు.

లడ్డూ విక్రయాలు పునఃప్రారంభం

సాగర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ టీటీడీ ఆలయంలో శుక్రవారం నుంచి లడ్డూ విక్రయాలను పునఃప్రారంభించినట్టు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల భారీ వర్షాలు కారణంగా తిరుపతి నుంచి లడ్డూ రవాణా నిలిచిపోయింది. దీంతో రుషికొండ ఆలయంలో విక్రయాలు నిలిపివేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించి రవాణా సౌకర్యం మెరుగుపడడంతో లడ్డూ లు ఆలయానికి చేరడంతో అమ్మకాలను పునఃప్రారంభించారు.

బోటు షికార్ పునరుద్ధరణ

సాగర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ, ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్న బోటు షికార్‌ను శుక్రవారం నుంచి పునరుద్ధరించారు. బంగాళాఖాతంలో అల్పా పీడనం నేపథ్యంలో ఈనెల 14వ తేదీ నుంచి సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బోటుషికార్‌ను నిలిపివేసిన విషయం తెలి సిందే. ప్రస్తుతం అలల తాకిడి తగ్గడంతో బోటు షికార్‌ను పునరుద్ధరించినట్టు నిర్వాహకులు వెల్లడించారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల అర్హత పత్రాల పరిశీలన

విశాలాక్షినగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కైలాసగిరి ఏఆర్ రిజర్వు పోలీసు గ్రౌండ్‌లో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్. మోహన్‌రావు పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. 659 మంది అభ్యర్థులలో 627 మంది హాజరయ్యారు. 70 మంది మహిళా అభ్యర్థులలో ఒకరు హాజరుకాలేదు. మహిళా అభ్యర్థుల కోసం రెండు కౌంటర్లను అందుబాటులో ఉంచారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సైబర్ సెల్ సీఐ బి.వెంకట్రావు, ఆర్‌ఐలు మన్మథరావు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు


అప్పన్న ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు

కనకమహాలక్ష్మీ ఆలయానికి పోటెత్తిన భక్తులు

మహారాణిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లో ఉన్న కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు, సుమారు 250 మంది మహిళలు ఈ పూజలో పాల్గొన్నారు. తొలుత ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం జరిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించి, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేపట్టారు. అలాగే వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోనూ శ్రావణ పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పలు బంగారు ఆభరణాలతో మహాలక్ష్మీ అలంకరణలో తయారు చేసి, భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో మహిళలు సామూహిక లలిత సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు.

సింహగిరిపై...

సింహాచలం : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన రాజగోపురం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ముందుగా ప్రకటించిన ప్రకారం తొలి స్లాట్ పూజలకు ఉదయం 7.40 గంటలకు దేవాలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో శ్రీకారం చుట్టారు. మూడు స్లాట్లలో మొత్తం మూడు వేల మంది మహిళలు పాల్గొన్నారు. ఆగమ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. శ్రీకాంతాచార్యులు, వేద పండితులు భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పించి వ్రతాల్లో పాల్గొన్న వారికి తోరగ్రంధి కట్టించారు. అనంతరం అమ్మవారికి షోడశోపచారాలు జరిపించారు. అష్టోత్తర శతనామావళితో కుంకుమార్చన చేశారు. ఈఓ వేంద్ర త్రినాథరావు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేశారు. వ్రతాల్లో పాల్గొన్న వారికి దేవస్థానం సిబ్బంది పూజా సామగ్రి అందజేశారు . కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

30న జనసేన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం

మహారాణిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంలో ఈనెల 30న జనసేన పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన వన్‌టౌన్‌లో ఉన్న ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 30న సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలతో సమావేశం అవుతారని చెప్పారు. సభను విజయవంతం చేయడానికి నాయ కులు బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, బీశెట్టి వసంత లక్ష్మి, ఉషశ్రీ, బెహరా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, జనసేన నాయకులు


జాబ్‌మేళాకు హాజరైన యువత

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

డాబాగార్డెన్స్ ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. పాత జైల్ రోడ్డులోని విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహించాలని ఆదేశించిందన్నారు. నియోజకవర్గంలోని యువత దీన్ని వినియోగించుకోవాలని చెప్పారు. 20 కంపెనీల్లో వెయ్యి మందికి పైగా యువతకు ఉద్యోగాలు కల్పించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి చాముండేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

... 5వ పేజీ తరువాయి

చిరంజీవి 82.77 మార్కులతో ద్వితీయ, ఓమ్మి గంగునాయుడు 82.06 మార్కులతో తృతీయ, హిందీలో కురచా జ్యోత్స్న 86.05 మార్కులతో ప్రథమ, రెడ్డి మహాలక్ష్మి 85.05 మార్కులతో ద్వితీయ, మండపాలి ఝాన్సీబాయి 83.07 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

ఇంగ్లీష్‌లో మరడాన శ్రావణి 86.13 మార్కులతో ప్రథమ, కేఎస్‌కేజే ప్రకాష్ 85.72 మార్కులతో ద్వితీయ, దాడి దివ్యపరిమళ 83.9 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో గొర్లె శివరామకృష్ణ 83.5 మార్కులతో ప్రథమ, చిట్టిమూరి వరప్రసాద్ 80.5 మార్కులతో ద్వితీయ, ఎర్ని శివప్రసాద్ 79 మార్కులతో తృతీయ, సోషల్ స్టడీస్‌లో గెంజి రవి 87.28 మార్కులతో ప్రథమ, భవిరిశెట్టి రామకృష్ణ 86.18 మార్కులతో ద్వితీయ, కర్రిరాజు నాగేశ్వరరావు 85.99 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఎస్జీటీ ఉర్దూలో షేక్ వాసింఅక్రమ్ 68.33 మార్కులతో ప్రథమ, పీడీఎస్ జావేద్ బాషా 62.6 మార్కులతో ద్వితీయ, పాలగిరి సానా 53.3 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

జోన్-1 ప్రాతిపదికన పీజీటీ ఫలితాలు వెల్లడి...

మొదట పీజీటీ (పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్స్) రాత పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. జోన్-1 (ఉత్తరాంధ్ర జిల్లాలు) పరిధిలో పీజీటీకి సంబంధించి అన్ని సబ్జెక్టులకూ కలిపి 73 పోస్టులు ఉన్నాయి. పీజీటీ ఇంగ్లీష్ పరీక్ష 1,659 మంది రాయగా వచ్చిన మార్కుల వివరాలను మెరిట్ లిస్టులో పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో పిన్నింటి రవికుమార్ అనే అభ్యర్థి 79.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, మజ్జి భవానీ 79 మార్కులతో రెండో ర్యాంకు, మళ్ల శ్రీను 78.5 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. హిందీ పరీక్ష 726 మంది రాయగా లెంక చక్రపాణి 82.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, కురచా నారాయణమూర్తి 82.5 మార్కులతో రెండో ర్యాంకు, చింతాటి భారతి 82 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. తెలుగు పరీక్ష 2,102 మంది రాయగా పి.ధర్మారావు 85.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, తుమరాడ దుర్గాప్రసాద్ 84.5 మార్కులతో రెండో ర్యాంకు, సరిపల్లి నాగరాజు 83 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. బయాలజీ సైన్స్ 549 మంది రాయగా కాట్రేనుకోన సత్యపావని 77.5 మార్కులతో ప్రథమ ర్యాంకు, కాలేరపు కిషోర్ 72.5 మార్కులతో ద్వితీయ స్థానం, అల్లైను సౌజన్య 72.5 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. సివిక్స్ (57 మంది)లో బోల్లేజు హరీష్ 76.5 మార్కులతో ప్రథమ స్థానం, బొమ్మిడి డిల్లేశు 69 మార్కులతో రెండో స్థానం, బూరి తవిటినాయుడు 66.5 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. కామర్స్‌లో 81.5 మార్కులతో మద్దాల అనిల్‌కుమార్ ప్రథమ స్థానం, 60.5 మార్కులతో దుద్ది సూర్యనారాయణ ద్వితీయ స్థానం, 59.5 మార్కులతో లింగాల మోహన్ తృతీయస్థానంలో నిలిచారు. గణితం (452 మంది)లో 78.5 మార్కులతో సుంకరాన విజయ, 73.5 మార్కులతో ఆరంగి ధనుంజయరావు, 72 మార్కులతో కొప్పల లక్ష్మణరావు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఫిజికల్ సైన్స్ (420 మంది)లో 74 మార్కులతో నక్కా హరిబాబు, 70 మార్కులతో వెలగల ఎర్రాపాత్రుడు, 68.5 మార్కులతో అల్లు అశోక్‌కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సోషల్ స్టడీస్ (146 మంది)లో కురమాన నిరోషా 85 మార్కులతో ప్రథమ స్థానం, రౌతు పోలినాయుడు 77.5 మార్కులతో ద్వితీయ స్థానం, కిల్లంపల్లి శ్రీకాంత్ 75.5 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

నిరసనలు, నిలదీతలు...

... 5వ పేజీ తరువాయి

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణకు వీలుగా పిలిచిన టెండర్లను రద్దు చేయాలని, సొంత గనులు కేటాయించాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ రాతపూర్వకంగా మేయర్‌కు వినతిపత్రం ఇవ్వగా, ఆ మేరకు తీర్మానం చేసినట్టు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుపై వైసీపీ నేతలది కపట ప్రేమ అని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు స్టీల్ ప్లాంటు పరిరక్షణకు కనీసం చర్యలు తీసుకోలేదని, బకాయిలను రాష్ట్రప్రభుత్వం తరపున రద్దు చేయాలని కోరితే కుదరదన్నారని గుర్తుచేశారు. అలాంటిది కూటమి ప్రభుత్వం రూ.14 వేల కోట్లు ప్యాకేజీని స్టీల్‌ప్లాంటుకు ప్రకటించి కాపాడేందుకు కృషిచేస్తే, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ డ్రామాలు ఆడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని హామీ ఇచ్చారు. కేవలం సమర్థ ఉత్పత్తి లక్ష్యంగానే 'కాంప్రెహెన్సివ్ కాంట్రాక్ట్ సిస్టమ్'లో భాగంగానే చిన్న చిన్న కాంట్రాక్టర్లను తొలగించి ఒకే కాంట్రాక్టును పిలుస్తున్నారని వివరణ ఇచ్చారు.

అనంతరం కోడి వ్యర్థాల తరలింపు అంశంపై చర్చ జరిగింది. జీవీఎంసీ పరిధిలో కోడి వ్యర్థాల సేకరణకు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లను ఎంపిక చేసినప్పటికీ, అనధికార వ్యక్తులు, రౌడీషీటర్లు కోడి వ్యర్థాలను సేకరించి చేపల చెరువులకు తరలించుకుపోతున్నారని జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రజారోగ్య విభాగం అధికారి కిషోర్ పాత్ర కీలకంగా ఉందని, ఆయన్ను ఐదేళ్లపాటు ఒకేచోట ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. అనధికారికంగా కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను స్వయంగా పట్టుకుని అప్పగించినా చర్యలు తీసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని గంధం శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఉదంతంలో లోతుగా విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్ కేతన్‌గార్గ్ వివరణ ఇస్తూ కోడి వ్యర్థాల తరలింపులో అవకతవకలు జరుగుతున్నమాట వాస్తవమేనని, దీనిని నియంత్రించేందుకు కొద్దిరోజులుగా సాంకేతిక పరిజ్ఞానం సాయం తీసుకుంటున్నామన్నారు. కోడి వ్యర్థాల నిర్వహణకు రెండ్రింగ్ యూనిట్‌ను నెలకొల్పేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామన్నారు.

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు గడువు పూర్తయిపోయినా సరే జీవీఎంసీలో పలు పనులను వారికేఎందుకు అప్పగిస్తున్నారని టీడీపీ, వైసీపీ, జనసేన సభ్యులు ప్రశ్నించారు. రూ.వేల కోట్ల విలువైన పనులు చేస్తున్న స్మార్ట్ సిటీని ఒక ప్రైవేటు ఉద్యోగి నడిపిస్తుండడం, జీవీఎంసీకి పర్యవేక్షణ అధికారం లేకపోవడం సరికాదని, తక్షణం ఆ ప్రాజెక్టులను జీవీఎంసీ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై తగు నివేదిక ఇవ్వాలని అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. నగరంలో రోడ్లను శుభ్రం చేసే వాహనాల నిర్వహణకు రూ.40 కోట్లతో టెండరు పిలిచే ప్రతిపాదనపై జనసేన, టీడీపీ, వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇంతవరకు ఏడాదికాలానికి టెండర్లు పిలిస్తే, ఇప్పుడు ఏకంగా రెండేళ్ల వ్యవధికి పిలవడం, బ్లాక్‌లిస్టులో ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు అనుకూలంగా నిబంధనలు మార్చడంపై సభ్యులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీనిపై స్పందించిన మేయర్ పీలా శ్రీనివాసరావు ఏడాదికాలానికి మాత్రమే టెండర్లు పిలిచేలా టెండరు నిబంధనలు మార్చాలని ఆదేశించారు.

యూసీడీ విభాగం ఆధ్వర్యంలో నగరంలో వీధివిక్రయదారుల కమిటీని నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేశారని, జీవీఎంసీపైనా, అధికారులపైనా కోర్టులో కేసులు వేసిన వ్యక్తులకు కమిటీలో స్థానం ఏ ప్రాతిపదికన ఇచ్చారో చెప్పాలంటూ పీతల మూర్తియాదవ్ ప్రశ్నించారు. అలాగే స్మార్ట్ వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు స్థలాలు ఎంపిక చేయడంపై కూడా సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేయడంతో ఆ అంశాలను వాయిదా వేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. ఎంవీపీ, ఎంకే ప్రాజెక్టు, సిరిపురంలోని ఎంవీపీ పీక్ ప్రాజెక్టులకు దొడ్డిదారిన టీడీఆర్‌లు జారీచేసి జీవీఎంసీకి రూ.కోట్లలో నష్టం కలిగించారని, దీని వెనుక డీటీసీపీ ఆర్జే విద్యుల్లత పాత్ర ఉన్నందున ఆమెపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సీసీపీ ప్రభాకరరావు వివరణ ఇస్తూ టీడీఆర్‌ల జారీ ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతుందని, గత రెండు నెలల్లో కేవలం 35 టీడీఆర్‌లు మాత్రమే జారీచేశామన్నారు. సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు జారీచేసి తర్వాత అబియెన్స్‌లో పెట్టేశారని, వారంతా నిరుపేదలు కాబట్టి తక్షణం వాటిని అబియెన్స్ నుంచి తొలగించి వారికి న్యాయం చేయాలని 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం కోరారు. కొత్తగా ఏర్పాటుచేయనున్న జోనల్ వ్యవస్థలో వార్డుల కేటాయింపు గందరగోళంగా ఉన్నందున పునఃపరిశీలించాలని 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, 69వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నీటి సరఫరా విభాగంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు రూ.వెయ్యి చొప్పున వేతనం పెంచేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మిగిలిన కార్మికులకు కూడా వేతనం పెంపుదలను వర్తింపజేయాలని రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి డిమాండ్ చేశారు.



రైతుబజారులో విక్రయిస్తున్న టమాటాలు

పెరుగుతున్న టమాటా ధర

గోపాలపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేశవాళీ టమాటా సీజన్ ముగియడంతో టమాటా ధర రోజు రోజుకీ పెరిగిపోతోంది. ప్రస్తుతం రైతుబజార్‌లో కిలో టమాటాలను రూ.50కి విక్రయిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో కిలో టమాటా ధర సుమారు రూ.25కి పైగా పెరిగింది. ప్రతి ఏడాది ఫిబ్రవరి నెల నుంచి జిల్లలో టమాటా సీజన్ ప్రారంభమవుతుంది. దాదాపు జూన్ నెల వరకు దేశవాళీ టమాటాలు లభ్యమవుతాయి. ప్రస్తుతం దేశవాళీ టమాటా సీజన్ ముగియడంతో చిత్తూరు, అనంతపురం జిల్లాలతో పాటు కర్ణాటక నుంచి కూడా నగరానికి టమాటా దిగుమతి అవుతుంది. దీంతో టమాటా ధరలు పెరిగిపోతున్నాయి. ఈ ధర ఇంకాస్త పెరిగే అవకాశం ఉన్నదని వర్తకులు చెబుతున్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

అగనంపూడి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీస్ సంస్థ స్థానిక శాక ఆధ్వర్యంలో బీసీ కాలనీలో దివ్యజ్యోతి భవనం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేస్తునట్టు సంస్థ ప్రతినిధి బీకే.రామకోటీ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

'వినాయక ఉత్సవ్ -25' పోస్టర్ ఆవిష్కరణ

పెదగంట్యాడ, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డులో బీజేఆర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న 'వినాయక ఉత్సవ్ -25'కు సంబంధిచిన పోస్టర్‌ను జీవీఎంసీ డిప్యూ టీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేఆర్ కాలనీలో తొమ్మిది రోజుల పాటు వినాయక ఉత్సవాలు నిర్వాహణకు యువత ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'కథలు-పరిశీలన' అంశంపై మల్లికార్జునకు డాక్టరేట్

విశాఖపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు పత్రికలో 'కథలు-పరిశీలన' అనే అంశంపై పరిశోధనలు పూర్తి చేసిన చెల్లూరి మల్లికార్జునకు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ శుక్రవారం ఆయనకు అందజేశారు. ఆచార్య జర్రా అప్పారావు పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధన చేశారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 32, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 22, బీరకాయలు 44, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 72, బరబాటి 38, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	101
లైవ్ ధర	121
విత్ స్కిన్	212
స్కిన్‌లెస్	222

అసలే ఇరుకు రోడ్డు... పైగా భారీ వాహనాలు

» కాపు జగ్గరాజు పేట రహదారిలో నిత్యం నరకం
» సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్న విద్యార్థులు, కార్మికులు





సబ్‌వే నుంచి వ్యాన్ రావడంతో నిలిచిపోయిన ట్రాఫిక్



వేరే దారి లేక నడుచుకుంటు వెళుతున్న విద్యార్థులు

కూర్మన్నపాలెం,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి కాపు జగ్గరాజు పేట రహదారిలో భారీ వాహనాల రాకపోకలకు నిషేధం ఉన్నప్పటికీ ఆ మార్గంలోనే తిరుగుతున్నాయి. దీంతో ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు, వీఎస్ఈజెడ్, ఆటోనగర్‌లో వివిధ పరిశ్రమలకు వెళ్లే కార్మికులు రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉ దయం ఈ మార్గంలో కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు నడుచుకుంటూనే కళాశాలకు చేరుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వీడియోలు, ఫొటోలు పలువురుకు పంపారు. సాధారణంగా ఉదయం 8 నుంచి 10 మధ్యలో కార్మికులు, విద్యార్థుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతే విధులకు, కళాశాలకు చేరుకోవడానికి ఆలస్యమవుతుందని కార్మికులు, విద్యార్థులు వాపోతు న్నారు. అలాగే సాయంత్రం సమయాల్లో కూడా ట్రాఫిక్ సమస్య ఎకుక్కవగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేస్తే కొంత వరకు సమస్యను అదుపు చేయవచ్చని పలువురు అభిప్రా యాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ మార్గం నుంచి భారీ వాహనాల రాకపోకలు నిషేధించాలని, పలువురు కోరుతున్నారు.

'ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి'



అవగాహన కల్పిస్తున్న సినర్జీస్ ఉద్యోగులు

కూర్మన్నపాలెం,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నియమాలను పాటించకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వీఎస్ ఈజెడ్ సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ భద్రతాధికారి ఎల్లాజీరావు అన్నారు. దువ్వాడ రహదారిలో వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నిడిపే సమయంలో హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని అన్నారు. ఇటీవల కూర్మన్నపాలెం రహదారుల్లో జరిగిన ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు పలువురు మృతి చెందారని అన్నారు. కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని, ప్రయాణం చేసే సమయంలో లైసెన్సు, సీబుక్, పొల్యూషన్ కంట్రోల్, ఇన్సూరెన్స్ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యపానం చేసి వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని అన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించిన ప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగవని పేర్కొన్నారు. అనంతరం సినర్జీస్ ఉద్యోగులతో రహదారి నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

వార్డు అభివృద్ధికి సహకరించాలని వినతి



జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 68వ వార్డులో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయించి వార్డు అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కేతన్‌గార్గ్‌కు కార్పొరేటర్ గుడివాడ అనూష వినతి పత్రాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రధాన సమస్యలను వివరించారు. ప్రస్తుతం వార్డులోని పలు కాలనీల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులకు త్వరితగతిన పూర్తి చేయించాలని కోరారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

పెందుర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసోత్సవాల ఆఖరి శుక్రవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నిజరూప దర్శనం భక్తులకు కల్పించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి నక్షత్ర హారతులిచ్చారు. గోదాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల భక్తులు తరలి వచ్చారు.

దుర్గమాంబ ఆలయంలో...

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దైవం దుర్గమాంబ ఆలయంలో ఆఖరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

స్థానిక భ్రమరాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్రనామా పారాయణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

» ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిపుణుడు సీహెచ్ దుర్గా మల్లేశ్వర్

మల్కాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్లలో వైరస్‌ను వ్యాప్తి చేయడం, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ మెసేజులు పంపడం, అనధికార ఈ-మేయిల్స్ పంపడం మొదలైన రకరకాల సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిపుణుడు సీహెచ్ దుర్గా మల్లేశ్వర్ అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సైబర్ నేరాల అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని లింకులను, ఈ-మేయిళ్లను ఉపయోగించకూడదని అన్నారు. మీ సైబర్ భద్రత కోసం పాస్వార్డ్ క్లిష్టంగా ఉండేలా చూసుకోవాలని, తెలియని ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మీ, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృత్తి కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

వేపగుంట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నాయుడుతోట సాయిమాదనగర్‌లో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఇంటర్ పూర్తయి విద్యార్థులకు పారామెడికల్, వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీజీఎమ్ కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారామెడికల్, హెల్త్ కోర్సులు చేసిన వారికి దేశంలో అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఇంటర్‌లో ఏ గ్రూపులోనైన ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డిప్లొమో ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్స్ కోర్సు, బైపీ సీలో ఉత్తీర్ణలైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల వ్యవధి ఉన్న బీఎస్సీ ఆప్టోమెట్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిఉన్న అభ్యర్థులు మరిన్ని వివరాలకు 9121005933, 9963582130 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

'దువ్వాడలో వందేభారత్‌కు హాల్టు కల్పించాలి'



సౌత్ కోస్ట్ రైల్వే జీఎం సందీప్ మాథూర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీఆర్‌యూపీ సభ్యులు

కూర్మన్నపాలెం,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడలో హాల్టు కల్పించాలని తూర్పుకోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం విశాఖ నగరం కార్యాలయంలో సౌత్ కోస్ట్ రైల్వే జీఎం సందీప్ మాథూర్‌కు వినతి పత్రం అందజేసారు. వందేభారత్ రైలులో ప్రయాణికులు లేకుండా రైలు నడుపుతున్నారని, దువ్వాడలో హాల్టు కల్పిస్తే రైలు ఖాళీగా నడపాల్సిన అవసరముండదన్నారు. విశాఖపట్నంలో తెల్లవారుజామున బయలు దేరే వందేభారత్ రైలును అందుకోవాలంటే గాజువాక పారిశ్రామిక ప్రాంతం నుంచి రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ట్రైన్‌కు అందుకోలేకపోతున్నారని అన్నారు. ప్రతిరోజు ఆక్యుపెన్సీ లేకుండా సుమారు వందల సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయని వినతిలో పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి నర్సాపురం రైలును పునఃప్రారంభించాలని, తిరుపతి డబుల్ డెక్కర్‌కు 2ఏసీ, 3ఏసీ సదుపాయం కల్పించాలని, దువ్వాడ రైల్వే స్టేషన్‌లో బోగీలకు వాటర్ ఎక్కించాలని, కోచ్ మెయింటెనెన్స్ సదుపాయం కల్పించాలని, పార్కింగ్ ధరలు తగ్గించాలని కోరారు.

బి-6 మోడల్ టెక్నాలజీపై డ్రైవర్లకు శిక్షణ పూర్తి



డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నూతనంగా ప్రారంభించబోతున్న బి-6 మోడల్ బస్సుల టెక్నాలజీపై డ్రైవర్లకు పూర్తిస్థాయి అవగాహన అవసరమని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. విశాఖ రీజియన్‌లోని 55 మంది డ్రైవర్లకు, ఆరుగురు మెకానిక్‌లకు బీ-6మోడల్ వాహన సాంకేతికత, డ్రైవింగ్‌లో వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మద్దిలపాలెం డిపో ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో వాహనకాలుష్యాన్ని తగ్గించేందుకు నూతనంగా బి-6 మోడల్ బస్సులు రాబోతున్నాయని అన్నారు. ఇప్పుడు శిక్షణ పొందిన డ్రైవర్లను బి-6 బస్సుల్లో డ్రైవర్లుగా నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సూపర్‌వైజర్లు మెకానిక్‌లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్లాంట్‌లో ఉన్న త్రిశక్తి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెకువజామునే ఆలయంలోని మహాదుర్గ, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

షిప్‌యార్డు టీఎన్‌టీయూసీ ప్రతినిధులు

మల్కాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యూనియన్‌లో ఉన్నవారందరూ కార్మికుల శ్రేయస్సు కోసం, హక్కులను కాపాడుకోడం కోసం నిరంతరం కృషి చేయాలిన టీఎన్‌టీయూసీ ప్రతినిధులు అన్నారు. షిప్‌యార్డు టీఎన్‌టీయూసీ సర్వ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ అందరూ ఐకమత్యంతో ఉంటే ఏ సమస్యనైనా సులువుగా పరిష్కరిచంకోవచ్చని అన్నారు. అనంతరం షిప్‌యార్డులో ఉన్న వివిధ విభాగాల కార్మికులు టీఎన్‌టీయూసీలో చేరారు. వారిని యూనియన్ ప్రతినిధులు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్యాయత్నం

గోపాలపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ మహిళ సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే సకాలంలో రైల్వే పోలీసులు రక్షించడంతో మహిళ ప్రాణాలతో బయటపడింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన పి.సౌమ్య (35) అనే మహిళ శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చింది. స్టేషన్‌లోని ఒకటో నెంబరు ఫ్లాట్ ఫారమ్ చివరన ఒంటరిగా తిరుగుతుండడంతో సమీపంలో ఉన్న రైల్వే పోలీసులు సౌమ్యను గమనిస్తున్నారు. అయితే అదే సమయంలో ఫ్లాట్‌ఫాంకు రైలు వస్తుండగా సౌమ్య ట్రాక్‌పైకి దిగి నిలబడింది. దీంతో జీఆర్పీ ఏఎస్ఐ కేఆర్‌కే రావు, హెడ్ కానిస్టేబుల్ రవి సౌమ్యను కాపాడారు. అనతరం ఆమెను వివ రాలు అడగగ ఆర్థిక ఇబ్బందులు తాళలేక తా ను ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించిన ట్టు పోలీసులకు తెలిపింది. దీంతో సౌమ్య కుటుంబీకులకు సమాచారం అందించి, కౌన్సెలింగ్ ఇచ్చిన క్షేమంగా కుంటుంబానికి అప్పగించారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



ప్రాంతీయ ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేస్తున్న అభిమానులు

అగనంపూడి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం స్థానిక చిరు అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక దుర్గమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిరంజీవి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 70 కేజీల కేకును కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో పండ్లు, పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. ఆస్పత్రి ప్రాంగణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పెందుర్తి, (ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్రమంత్రి మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు వేడుకలను పెందుర్తిలో మెగా అభిమానులు, జనసేన కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాతనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో కేకును కట్‌చేసి కర్యాకర్తలు ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం చిరంజీవి సినీ జీవిత ప్రస్థానం లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేగి దివాకర్, ఆర్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ఎనలేనివి'

గాజువాక , ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ 22వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం గాజువాకలో నిర్వహించిన శాంతి ర్యాలీని సీఐ పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 835 మృతదేహాలను మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తమ అంతిమ యాత్ర రథంలో తీసుకువెళ్లీ ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్

సీజనల్ వ్యాధులపై అవగాహన

మల్కాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ, చికెన్ గునియా, మలేరియా తదితర సీజనల్ వ్యాధులను వ్యక్తిగత శుభ్రతతోనే నివారించవచ్చని మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ అన్నారు. 59వ వార్డు గణపతినగర్‌లో మల్కాపురం మలేరియా విభాగం ఆధ్వర్యంలో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాంటులో ప్రైవేట్ క్యాంటీన్‌లు లేక ఇబ్బందులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేట్ క్యాంటీన్ లేక తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని కార్మిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌లో ఉన్న క్యాంటీన్‌లలో సరైన సదుపాయాలు లేవని, తినడానికి కూడా ఏమీ ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు క్యాంటీన్‌లలో అన్ని రకాలు ఉంటాయని పేర్కొన్నారు. దీనిపై యాజమాన్యం స్పందించి ప్రైవేటు క్యాంటీన్‌లకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

» ఉక్కు గుర్తింపు యూనియన్ డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో వీలీనం చేయాలని ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీఎస్ఎన్.రావు, డి.ఆదినారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై చేసిన వాఖ్యలు ఖండిస్తున్నామని, ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా సెయిల్‌లో వీలీనం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ప్రైవేటీకరణకు సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి ముందస్తు సమచారం లేకుండా తొలగించారని, వీఆర్ఎస్ పేరుతో నైపుణ్యం కలిగిన ఉద్యోగులను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉక్కు నిర్వాసితులకు ఇప్పటివరకు సంపూర్ణ న్యాయం జరగలేదని అన్నారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.

ఉత్తమ ప్రతిభతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

» స్టీల్‌ప్లాంట్ డీజీఎం కె.రాహుల్



నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ప్రతిభతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టీల్‌ప్లాంట్ డీజీఎం కె.రాహుల్ అన్నారు. ప్లాంట్ డీపీఎస్‌లో శుక్రవారం వార్షిక అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే ఉపాధ్యాయులు నిత్య విద్యార్థుల్లా ఉండి బయటున్న పోటీ వాతావరణానికి అనుగుణంగా విద్యాబోధన చేయాలని ఆకాంక్షించారు. సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో 'సుందరకాండ' చిత్ర బృందం సందడి



విద్యార్థులతో మాట్లాడుతున్న కథానాయకు నారా రోహిత్

అగనంపూడి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 'సుందరకాండ' చిత్ర బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా సినిమా కథానాయకుడు నారా రోహిత్, కథానాయికి శ్రీదేవి విద్యార్థులను కలిసి సందడి చేశారు. విద్యార్థులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉన్నదని అన్నారు. ఈ చిత్రం విభిన్న ప్రేమకథ ఆధారంగా చిత్రీకరించారని దీనిని ఆదరించాలని కోరారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సంతోశ్, ఈవెంట్ మేనేజర్ యుధీర్, ప్రిన్సిపాల్ అరుంధతి తదితరులు పల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు

గాజువాక, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జోనల్ పరిధిలో పలువార్డుల్లో వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వార్డుకు 70 చొప్పున వీధి లైట్లు మంజురయ్యాయి. లైట్లు లేని చోట్ల కొత్తవి ఏర్పాటు చేసేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. లైటను బిగించేందుకు అవసరమైన క్లిప్పింగ్‌లు లేకపోవడంతో కొంతమేర జాప్యం జరిగింది. ఇప్పుడు అన్ని వస్తువులు సమకూరడంతో ప్రతి వార్డులోను కొత్తలైట్లు ఏర్పాటు చేస్తున్నామని జోనల్ విద్యుత్ విభాగం అధికారులు తెలిపారు. రెండేళ్లగా వీధిలైట్లు పలు ప్రాంతాలు చీకటిమయంగా మారాయని పలువురు కార్పొరేటర్లు అధికారులను విన్నవించారు. కొంత మంది కార్పొరేటర్లు అయితే నిరసన కూడా వ్యక్తం చేశారు.

29 నుంచి ప్రో కబడ్డీ లీగ్

» సెప్టెంబరు 11 వరకు 28 మ్యాచ్‌లు
» 25న ఆటగాళ్ల రాక
» 26 నుంచి పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో సాధన

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 29 నుంచి జరగనున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12 సిరీస్‌కు ఏర్పాట్లు ప్రారంభమవుతున్నాయి. దాదాపు ఏడేళ్ల తర్వాత విశాఖ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో క్రీడాభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 11 వరకు 14 రోజులు జరగనున్న సీజన్-12 లెగ్-1 మ్యాచ్‌లలో హోం టీం తెలుగు టైటాన్స్‌తో పాటు బెంగాల్ వారియర్స్, బెంగళూరు బుల్స్, దబాంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్, హర్యానా స్టీలర్స్ జైపూర్ పింక్ పాంథర్స్, పాట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ్ తలైవాస్, యు ముంబా, యూపీ యోధా కలిపి 12 జట్లు తలపడనున్నాయి. ఈ మెగా టోర్నీలో 108 మ్యాచ్‌లకుగాను జైపూర్, చెన్నై, ఢిల్లీతోపాటు విశాఖలోని పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియాన్ని వేదికలుగా ఖరారు చేశారు. విశాఖలోని పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో 28 మ్యాచ్‌లు జరగనున్నాయి.



తెలుగు టైటాన్స్ జట్టు

25న ఆటగాళ్ల రాక

పీకేఎల్-12 పాల్గొంటున్న 12 జట్ల ఆటగాళ్లు ఈ నెల 25న నగరానికి చేరుకోనున్నారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుంచి నేరుగా విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి హోటల్‌కు వచ్చి విశ్రాంతి తీసుకుంటారు. ఈ నెల 26 నుంచి 28 వరకు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జట్ల వారీగా సాధన చేస్తారు.

రోజూ రెండు మ్యాచ్‌లు

ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 11 వరకు రోజూ రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. రాత్రి 8 గంటలకు తొలి మ్యాచ్, 9 గంటలకు రెండో మ్యాచ్ జరగనుంది.

రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం ముస్తాబు

రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యాధునిక లేజర్ లైట్లు, సౌండ్ సిస్టమ్, ఆధునిక కబడ్డీ మేట్‌లతోపాటు ముఖ్య అతిథులకు సీటింగ్, ప్రత్యక్ష ప్రసారాల చానెల్స్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.

దాదాపు ఏడేళ్ల తర్వాత

తెలుగు టైటాన్స్ హోం టీంగా 2014 ఆగస్టు 16 నుంచి 19 వరకు జరిగిన ఇండియన్ ప్రొఫెషనల్ కబడ్డీ లీగ్ (పీకేఎల్) తొలి సీజన్‌కు పోర్టు రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా ఏడు మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన విశాఖ... తర్వాత పీకేఎల్ సీజన్-3 టోర్నీకి సంబంధించి 2016 జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు మరో ఏడు మ్యాచ్‌లకు, చివరిగా పీకేఎల్ సీజన్-6కు సంబంధించి 2018లో డిసెంబరు 7 నుంచి 13 వరకు 11 మ్యాచ్‌లకు పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం ఆతిథ్యమిచ్చింది. ఇప్పుడు దాదాపు ఏడేళ్ల తర్వాత ఈ ఏడాది ఆగస్టు 29 నుంచి జరగనున్న పీకేఎల్ సీజన్-12 టోర్నీకి విశాఖ ఆతిథ్యమివ్వనుంది.

తెలుగు టైటాన్స్ జట్టు ప్రకటన

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆతిథ్య తెలుగు టైటాన్స్ జట్టును శుక్రవారం యాజమాన్యం ప్రకటించింది. యజమాని శ్రీనివాస్ శ్రీరామినేని మాట్లాడుతూ ప్రో కబడ్డీ లీగ్ సీజన్-12లో కొన్ని మ్యాచ్‌లను విశాఖకు తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లు పూర్తి సహకారం అందించారన్నారు. తెలుగు టైటాన్స్ ఆతిథ్య జట్టుగా పాల్గొనే తొలి దశ లీగ్ మ్యాచ్‌లు ఇక్కడ విజయవంతంగా జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రో కబడ్డీ లీగ్‌తో ప్రపంచ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్‌కు మరింత ఖ్యాతి వస్తుందని అభిప్రాయపడ్డారు. తెలుగు టైటాన్స్ సీఈవో త్రినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడి క్రీడాభిమానులు, ప్రేక్షకులు గతంలో అందించిన ప్రోత్సాహం మరువలేమన్నారు. ఈసారీ మద్దతు లభిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

జట్టు సభ్యులు వీరే

డిఫెండర్లు...అజిత్ పాండురంగ్ పవార్, సాగర్, అంకిత్, అవి దుహన్, బంటు, శుభం షిండే, అమేన్, అమీర్ హుస్సేన్, రాహుల్ దగర్;

రైడర్స్...చేతన్ సాహు, నితిన్, రోహిత్, ప్రఫుల్ సుధామ్ జావరే, జై భగవాన్, మన్‌జీత్, ఆశిష్ నార్వాల్;

ఆల్ రౌండర్లు...శంకర్ భీమ్‌రాజ్ గడై, విజయ్ మాలిక్, భరత్, గణేష్ పార్కి; జట్టు సారథిగా విజయ్‌మాలిక్, ఉప సారథిగా శుభం షిండే.

జట్టు ఆడే ఐదు మ్యాచ్‌ల షెడ్యూల్

ఈ నెల 29న తమిళ్ తలైవాస్‌తో, 30న యూపీ యోధాస్, సెప్టెంబరు 4న జైపూర్ పింక్ పాంథర్స్, 7న బెంగాల్ వారియర్స్, 10న యు ముంబాయితో తెలుగు టైటాన్స్ ఆడనుంది.

క్రైం... crime news

రూ.1.21 కోట్ల చోరీ సొత్తు రికవరీ

» 64 కేసులు ఛేదించి 66 మంది అరెస్టు
» రికవరీ మేళాలో బాధితులకు అప్పగించిన పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



రికవరీ డబ్బును పోగొట్టుకున్న మహిళకు అప్పగిస్తున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

మహారాణిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జూలై నెలలో నమోదైన నేర ఘటనలలో 64 కేసులను పోలీసలు ఛేదించారు. 66 మంది నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 1,20,58,150 విలువైన చోరీ సొత్తును రికవరీ చేశారు. శుక్రవారం పోలీసు కమీషనరేట్‌లో రికవరీ మేళా నిర్వహించి సొత్తు పోగొట్టుకున్న వారికి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి డబ్బు, నగలు, ఇతర వస్తువులను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. నగర పోలీసు కమిషన రేట్ పరిధిలో పలు దొంగతనాలు సహా 101 నేరాలు జరగ్గా, అందులో 64 కేసులు ఛేదించి 66 మందిని అరెస్టు చేశారు. 64 కేసులలో 2 దోపిడీలు, 15 ఇళ్లలో దొంగతనాలు, ఒక గొలుసు, 19 ద్విచక్రవాహనాలు, 2 కార్లు, ఆటో, మరో 18 సాధారణ దొంగతనాలు జరిగాయి. 1263.80 గ్రాముల బంగారం, 1923.71 గ్రాముల వెండి, రూ.14,32,350 నగదు, ద్విచక్రవాహనాలు 15, కార్లు 2, ఆటో, మొబైల్ ఫోన్లు 259, ల్యాప్‌టాప్, బరువు తూసుకునే పరికరం, కాపర్‌వైర్ 29 కేజీలు కలిపి మొత్తం విలువ రూ.1,20,58,150 విలువైన వస్తు వులను రికవరీ చేసినట్లు వివరించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో 374 సీసీ కెమేరాలు ఏర్పాటుచేసి, నేర నిరోధానికి 134 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మేళాలో పోలీసు అధికారులు, బాధితులు పాల్గొన్నారు. చోరీ సొత్తు తిరిగి లభించడంతో పలువురు సంతోషం వ్యక్తంచేశారు.

విజయవంతంగా ముగిసిన క్వాంటమ్ వాలీ సదస్సు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు జరిగిన అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాక్‌థాన్ సన్నాహక సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఏయూ, అనుబంధ కళాశాలల నుంచి 198 మంది పాల్గొన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అంటే ఏమిటి, దీన్ని వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఎలా ఉపయోగించాలి, స్టార్టప్‌ను ఎలా ప్రారంభించాలి, ఆలోచనలు ఎలా వాణిజ్యీకరించాలి అనే అంశాలపై చర్చలు జరిగాయి. డి.లలిత సమన్వయకర్తగా వ్యవహరించారు.

29న క్రీడా దినోత్సవానికి ముఖ్యమంత్రి రాక

» సభా ప్రాంగణం ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, శాప్ చైర్మన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 29న జరగనున్న జాతీయ క్రీడా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, శాప్ చైర్మన్ రవినాయుడు శుక్రవారం పరిశీలించారు. సభా ప్రాంగణం, వేదిక, ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దిశానిర్దేశం చేశారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతి చాంపియన్‌షిప్ పేరుతో ఈ నెల 24 నుంచి 26 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల విజేతలకు ఇక్కడ జరగనున్న క్రీడా దినోత్సవంలో ముఖ్యమంత్రి బహుమతులు అందజేస్తారని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, శాప్ డైరక్టర్లు పాల్గొన్నారు.

సముద్రవిద్య రాజధానిగా విశాఖ



సమావేశంలో మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సముద్రవిద్యా రాజధానిగా విశాఖపట్నం మారబోతుందని పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. వైజాగ్ స్కిల్ సెయిల్ 25-స్కిల్‌డెవలప్‌మెంట్ కాన్‌క్లేవ్ విత్ గ్రీన్ పోర్టు స్టార్టప్‌ను శుక్రవారం నగరంలోని ప్రముఖ హోటల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ వికసిత్ భారత్-2047 ప్రణాళికలకు అనుగుణంగా పోర్టును అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖను దేశంలో అగ్రగామి సముద్ర నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు అతి పొడవైన సాగరతీరం ఉన్నందునే సముద్ర రవాణా రంగాన్ని ప్రధానవనరుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. పోర్టు ఆధారిత తయారీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీధర్, ఐఏఎస్ అధికారి టీకే రామచంద్రన్, పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో మునిగిపోయిన బోటు

తెప్పల సాయంతో ఒడ్డుకు చేరిన ఐదుగురు మత్స్యకారులు



సముద్రంలో మునిగిపోతున్న బోటు

మహారాణిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు బయలుదేరిన ఓ బోటు ప్రమాదవశాత్తూ మునిగిపోయింది. అయితే అందులో ఉన్న ఐదుగురు మత్స్యకారులు తెప్పల సాయంతో క్షేమంగా ఒడ్డుకు చేరారు. వివరాలిలా ఉన్నాయి. ఫిషింగ్ హార్బర్ నుంచి జి.బాల కృష్ణకు చెందిన బోటులో శుక్రవారం ఉదయం ఐదు గంటలకు వి.తులసీరావు, వి.రమేష్, పి.హరికృష్ణ, అబ్దుల్‌ఘోష్, సీహెచ్ గురుమూర్తి, కలిసి చేపల వేటకు బయలుదేరి వెళ్లారు. జెట్టీ నుంచి సుమారు మూడు కిలోమీటర్లు వెళ్లిన తరువాత నీటి ప్రవాహానికి బోటు బాగా కుదుపులకు గురం య్యింది. ఈ క్రమంలో బోటు చెక్క ఒకటి ఊడిపోవడంతో సముద్రం నీరు లోపలకు చొచ్చుకువచ్చింది. అది గమనించిన మత్స్యకారులు వెంటనే వెనక్కి బయలుదేరారు. అయితే కొద్దిసేపటికే బోటు పూర్తిగా మునిగి పోసాగింది. దీంతో మత్స్యకారులు తమకు రక్షణగా తీసుకువెళ్లిన తెప్పల సహాయంలో క్షేమంగా తీరానికి చేరుకున్నారు. బోటు పూర్తిగా మునిగిపోవడంతో యజమానికి భారీనష్టం వాటిల్లింది.



క్షేమంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులతో స్థానికులు

అందమైన ప్రేమకథా చిత్రం 'సుందరకాండ'



సమావేశంలో పాల్గొన్న నారా రోహిత్, శ్రీదేవి, వీర్తి, నిర్మాత సంతోష్

రామ్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సుందరకాండ.. అందమైన సరికొత్త ప్రేమకథా చిత్రమని సినీ హీరో నారా రోహిత్ అన్నారు. సందీప్ పిక్చర్స్ బ్యానర్‌పై నారా రోహిత్ హీరోగా ఈశ్వర్ ఫేం శ్రీదేవి, వీర్తివిఘాని హీరోయిన్లుగా నిమ్మలపూడి వెంకటేష్ దర్శకత్వంలో రూపొందించిన 'సుందరకాండ' చిత్రం ప్రమోషన్‌లో భాగంగా విశాఖలోని హోటల్ నోవాటెల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నారా రోహిత్ మాట్లాడుతూ 27న వినాయక చవితి పండుగ సందర్భంగా సుందరకాండ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నామని తెలిపారు. అందరినీ ఆహ్లాదపరిచే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని పేర్కొన్నారు. కొత్తపాయింట్‌తో ప్రతీ సీన్ కొత్తగా అనిపించేలా స్క్రీన్‌ప్లే ఉంటుందని తెలిపారు. సినిమాను విశాఖ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించినట్లు తెలిపారు. వైవిధ్యమైన కథలతో సినిమాలు చేస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో తప్పనిసరిగా రాజకీయాల్లోకి వెళతానని ప్రకటించారు. ఈ సమావేశంలో హీరోయిన్లు శ్రీదేవి, వీర్తి, నిర్మాత సీహెచ్ సంతోష్ పాల్గొన్నారు.

బోట్ బోల్తా.. మత్స్యకారుడి మృతి



మృతుడు రాము (ఫైల్‌ఫొటో)

భీమునిపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన బోట్ ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో బోయవీధికి చెందిన మత్స్యకారుడు చింతపల్లి రాము (46) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున బోయ వీధికి చెందిన ఐదుగురు మత్స్యకారులు చింతపల్లి రాము, కొక్కిరి రమణ, కదిరి అప్పలరాజు, కొక్కిరి వీర్రాజు, గొరక రాజులు ఫైబర్‌బోట్‌లో వేటకు వెళ్లారు. ప్రారంభంలో సముద్రం సాఫీగా వున్నా లోపలకు వెళ్లేకొద్దీ అల్లకల్లోలంగా ఉండడంతో భయాందోళనలకు గురై తిరుగు ప్రయాణమయ్యారు. తీరానికి సమీపిస్తున్న సమయంలో పెద్ద పెద్ద అలలు తెరలుగా ఒకేసారి రావడంతో తాకిడికి బోటు బోల్తా పడింది. దీంతో అందరూ నీళ్లలో పడిపోయారు. రాము ఉప్పునీరు ఎక్కువగా తాగడంతో ఒడ్డుకు తీసుకువచ్చి సీపీఆర్ చేశారు. తర్వాత భీమిలి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి, 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. తర్వాత భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ప్రమాదంలో మిగిలిన నలుగురు మత్స్యకారులు సురక్షితంగా వున్నారు. మృతుడు రాముకు భార్య ధనలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బోయవీధి విషాదంలో మునిగింది.